మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 1-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 || సంచిక: 33 Issue: 33

01 ఆగస్టు 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:59 సూర్యాస్తమయం - సా. 6:45 తిథి తదియ రా. 11:04 వరకు తరువాత చవితి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం శతభిష రా. 8:33 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం శోభన రా. 11:18 వరకు కరణం వనిజ ఉ. 10:50 వరకు విష్టి రా. 11:04 వరకు వర్జ్యం తె. 3:23 నుండి తె. 5:02 వరకు దుర్ముహూర్తం ఉ. 7:41 నుండి ఉ. 8:32 వరకు రాహుకాలం ఉ. 9:10 నుండి ఉ. 10:46 వరకు యమగండం మ. 1:58 నుండి మ. 3:34 వరకు గుళికకాలం తె. 5:59 నుండి ఉ. 7:34 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:23 నుండి తె. 5:11 వరకు అమృత ఘడియలు మ. 1:09 నుండి మ. 2:50 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## • పీఎం కిసాన్.. ఐదేళ్లు పొడిగింపు

న్యూఢిల్లీ: రైతులకు పెట్టుబడి సాయం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని మరో 5 సంవత్సరాలు పొడిగిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం రానున్న 5 సంవత్సరాలకు గానూ రూ.3.15 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ పీఎం తరువాయి 2 వ పేజీలో...



## • రేషన్ ఈ-కేవైసీ గడువు.. ఆగస్టు 31

హైదరాబాద్, జూలై 31 (ఈవార్తలు): రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు ఇచ్చిన గడువును ఆగస్టు 31 వరకు పొడిగించింది. గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వివిధ కారణాలతో ఇప్పటివరకు ఈ-కేవైసీ పూర్తి చేయలేకపోయిన వారికి ఇది పెద్ద ఊరటగా మారింది. మొదట ఈ వెసులుబాటును జీహెచ్ఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఇతర జిల్లాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తరువాయి 2 వ పేజీలో...




## • ఫసల్ బీమా గడువు.. ఆగస్టు 15

న్యూఢిల్లీ: రైతులకు ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద పంటల బీమా నమోదు గడువును ఆగస్టు 15 వరకు పొడిగించింది. ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో పలు ప్రాంతాల్లో వర్షాలు ఆలస్యంగా కురవడం, సాగు పనులు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో రైతుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. గడువు పొడిగింపుతో ఇప్పటివరకు పంటల బీమా నమోదు చేసుకోని రైతులకు మరో అవకాశం లభించింది. రైతులు తమ సమీపంలోని బ్యాంకులు, వ్యవసాయ శాఖ తరువాయి 2 వ పేజీలో...



## • ఎస్ఐఆర్ గడువు.. ఆగస్టు 10

హైదరాబాద్, జూలై 31 (ఈవార్తలు): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి పొడిగించింది. గతంలో ఆగస్ట్ 3వ తేదీన ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు చివరి తేదీగా గడువును విధించిన ఎన్నికల సంఘం.. తాజాగా దాన్ని మరోసారి పొడిగించి ఆగస్ట్ 10వ తేదీ వరకు అవకాశం కల్పించింది. దీంతో ఇంకా ఫారాలు సమర్పించని ఓటర్లు ఈ అదనపు సమయాన్ని వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం అధికారులు ఓటర్లకు తరువాయి 2 వ పేజీలో...




# ఉద్యమయోధుడికి జన నివాళి

### పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో ఇసుకేస్తే రాలనంత జనం

### భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు

### ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు

ఏం జనం.. ఏం జనం.. ఈ మధ్య కాలంలో ఒక ప్రముఖ వ్యక్తి చనిపోతే ఇంత మంది వచ్చిన దాఖలాలు లేవు. కానీ, బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమ యాత్రలో ప్రజలు భారీగా తరలివచ్చారు. ఉద్యమయోధుడిని, తమ అభిమాన నాయకుడిని చూసేందుకు ఇసుకేస్తే రాలనంత జనం తరలివచ్చారు. ఆయన భౌతికకాయాన్ని తొలుత హనుమకొండకు తీసుకువచ్చి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.

నర్సంపేట, జూలై 31 (ఈవార్తలు): నర్సంపేట మీదుగా ఆయన స్వగ్రామమైన నల్లబెల్లికి వరకూ అశేషంగా తరలివచ్చిన నాయకులు, అభిమానులతో సాగింది పెద్ది అంతిమయాత్ర. నల్లబెల్లిలో పెద్ది పార్థీవ దేహాన్ని గంట సేపు ఉంచి.. తర్వాత వ్యవసాయ క్షేత్రంలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ అభిమాన నాయకుడి కడసారి చూపుకోసం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా.. ఆయన అంతిమయాత్రలో పాల్గొని కన్నీళ్లతో వీడ్కోలు పలికారు. ప్రభుత్వ తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,460 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,992 |



# నవంబర్ 30 వరకు ఎల్ఆర్ఎస్ గడువు

### మరోసారి డెడ్‌లైన్ పొడిగింపు

హైదరాబాద్, జూలై 31 (ఈవార్తలు): తెలంగాణలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)కు ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించింది. ఎల్ఆర్ఎస్ ఫీజులు , ఛార్జీల చెల్లింపునకు నవంబర్ 30వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా ఎల్ఆర్ఎస్ ఫీజులపై ఇప్పటికే అమలులో ఉన్న 25 శాతం రాయితీని కూడా కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ జీఓ ఎంఎస్ నంబర్ 213ను విడుదల చేశారు. రాష్ట్రంలో అనుమతిలేని లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వ హయాంలో తరువాయి 2 వ పేజీలో...

# పెళ్లైనా.. కూతుళ్లకు కారుణ్య ఉద్యోగం!

### కొడుకు, బిడ్డ మధ్య వివక్ష తగదు.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

వాహిత అనే కారణంతో కూతురికి కారుణ్య నియామకాన్ని నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని దేశ అత్యున్నత ధర్మాసనం సుప్రీం కోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. కేవలం విడాకులు తీసుకున్న లేదా భర్త నుంచి విడిపోయిన కుమార్తెలకు మాత్రమే ఈ అవకాశం కల్పించే ప్రభుత్వ నిబంధనలు చెల్లవని తేల్చిచెప్పింది. ఇటువంటి వర్గీకరణ రాజ్యాంగంలోని అధికరణ 14 ప్రకారం కల్పించిన సమానత్వ హక్కుకు పూర్తి విరుద్ధమని న్యాయస్థానం పేర్కొంది.



న్యూఢిల్లీ: విబీహార్ ప్రభుత్వానికి చెందిన 2014 నాటి విధానాన్ని సవాలు చేస్తూ సయారా ఖాతూన్, ఆమె కుమార్తె దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తండ్రి మరణానంతరం ఉద్యోగం కోసం కుమార్తె చేసుకున్న దరఖాస్తును తొలుత బీహార్ ప్రభుత్వం, అనంతరం పాట్నా హైకోర్టు తిరస్కరించడంతో బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "కుమారులు, కుమార్తెల మధ్య ఎలాంటి వివక్ష చూపినా తరువాయి 2 వ పేజీలో...





# ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ షురూ

### ప్రభుత్వ సేవలకు ఉపయోగకరం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, జూలై 31 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తాజాగా ప్రకటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ ప్రభుత్వ సేవలు, అధికారిక ధ్రువీకరణ అవసరాల కోసం ఈ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడిన భట్టి విక్రమార్క.. కుటుంబ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



మెదడు కణాల మధ్య ఉండే అనుసంధానాలు 'సినాప్సిస్' అత్యంత కచ్చితత్వంతో మార్చగల 'సిన్‌ట్రోగో' అనే వినూత్న సాంకేతికతను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఎలుకలపై నిర్వహించిన ప్రయోగాల్లో ఈ విధానం జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యాన్ని మెరుగుపరిచినట్లు పరిశోధకులు వెల్లడించారు. పరిశోధనలో భాగంగా సినాప్సుల్లో సుమారు 25 శాతం తొలగించిన తర్వాత జ్ఞాపకశక్తి పెరిగినట్లు గుర్తించామని పేర్కొన్నారు.

# ఏపీలో 45 లక్షల ఓట్లు తొలగింపు


### ఓటర్ల జాబితాలో భారీ మార్పులు.. స్పష్టం చేసిన ఎన్నికల సంఘం



న్యూఢిల్లీ/అమరావతి, జూలై 31 (ఈవార్తలు): ఏపీవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ అనంతరం దాదాపు 45 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగిస్తూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) శుక్రవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి పేర్లను ఈ జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఆ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. తెలిపిన వివరాల ప్రకారం.. తొలగించిన ఓట్లలో

# నేడు ఏపీకి ప్రధాని మోదీ రాక

### భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం.. 17,900 కోట్ల పనులకు శ్రీకారం



# రంగనాథ్‌ను వెంటనే తప్పించండి

### చట్ట ప్రకారం పనిచేసేవాళ్లకు హైడ్రా బాధ్యతలు.. సీఎస్‌కు తెలంగాణ హైకోర్టు తాజా ఉత్తర్వులు

### వ్యక్తుల పాలన కాదు.. చట్టపాలనే కొనసాగాలి.. హైకోర్టు ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 31 (ఈవార్తలు): హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులను ఏవీ రంగనాథ్ స్పష్టంగా ఉల్లంఘించారని ధర్మాసనం తేల్చింది. ఆయనను వీలైనంత త్వరగా హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించి, ఆ స్థానంలో మరో సమర్థవంతమైన అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. శాంతాశ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన లోతుకుంట భూ వివాదం





# డబుల్ గోల్డ్

### జూడోలో భారత్‌కు రెండు స్వర్ణాలు

### అస్మిత, హర్ష్‌లకు బంగారు పతకాలు

(..పూర్తి వివరాలు క్రీడావాణి పేజీలో..)

## రాశి ఫలాలు

1.8.2026

మేషం: నూతన పనులకు శ్రీకారం చుడతారు. మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

వృషభం: చేపట్టిన పనులు ఆశాజనకంగా సాగుతాయి. నూతన పనులకు శ్రీకారం చుడతారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన వాహనయోగం ఉన్నది. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధిగమించి ముందుకు సాగుతారు.

మిథునం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. వ్యాపారాలలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇంటాబయటా ఒత్తిడులు పెరుగుతాయి. వృత్తి, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

కర్కాటకం: ముఖ్యమైన పనులు వాయిదా వెయ్యడం మంచిది. వృత్తి వ్యాపారాలలో శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. సోదరులతో ఆస్తి వివాదాలు కలుగుతాయి. మానసిక ప్రశాంతతకు పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

సింహం: ఇంటా బయట నూతన విషయాలు తెలుసుకుంటారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

కన్య: చిన్ననాటి మిత్రులను కలుసుకొని కష్టసుఖాలు చర్చిస్తారు. నూతన వాహనయోగం ఉన్నది. దీర్ఘకాలిక వివాదాల నుంచి బయటపడతారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి.

తుల: ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. నూతన ఋణయత్నాలు అనుకూలించవు. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. దూరప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. వ్యాపార ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

వృశ్చికం: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంపై అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగులకు స్థానచలనాలు తప్పవు.

ధనస్సు: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సంతాన విద్యా ఉద్యోగ విషయంలో శుభవార్తలు వింటారు. మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. రాజకీయ వర్గాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది.

మకరం: కుటుంబ సమస్యలు చికాకు పరుస్తాయి. చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. ఆర్థికపరంగా గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుంటాయి. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తప్పవు.

కుంభం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగులు ఉన్నత పదవులు పొందుతారు.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు కలుగుతాయి. అనుకోని ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు ముందుకు సాగక నిరాశ పరుస్తాయి. నిరుద్యోగులకు రావలసిన అవకాశాలు చేజారుతాయి.

# నేడు ఏపీకి ప్రధాని మోదీ రాక

## భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం.. 17,900 కోట్ల పనులకు శ్రీకారం

విజయనగరం/అమరావతి, జూలై 31 (ఈవార్తలు): ప్రధాని మోదీ భోగాపురం పర్యటనపై ప్రధానమంత్రి కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. విజయనగరం జిల్లా భోగాపురంలో రేపు రూ.17,900 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించింది. రూ.5,640 కోట్ల వ్యయంతో నిర్మించిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేస్తారని వెల్లడించింది. ఏటా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో విమానాశ్రయం నిర్మించినట్లు తెలిపింది. ఏఐ, బయోమెట్రిక్ ప్రాసెసింగ్, ఆటోమేటెడ్ బ్యాగేజీ సిస్టమ్, 5 మెగావాట్ల సోలార్ ప్లాంట్ వంటి ఆధునిక సదుపాయాలు ఉన్నట్లు పేర్కొంది. రూ.460 కోట్లతో విశాఖపట్నంలో ఏర్పాటుచేసే ఆంధ్రప్రదేశ్ తొలి సెమీకండక్టర్ తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేస్తారని ప్రధాని కార్యాలయం వివరించింది. ఈ ప్లాంటులో ఏడాదికి 9.6 కోట్ల సెమీకండక్టర్ చిప్‌లు తయారవుతాయంది. రూ.5,550 కోట్లతో ఏర్పాటుచేస్తున్న కర్నూలు పునరుత్పాదక ఇంధన జోన్ విద్యుత్ ప్రసార వ్యవస్థ ప్రాజెక్టుకు మోదీ శంకుస్థాపన చేస్తారు. రూ.3,550 కోట్లతో కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఏర్పాటైన సోలార్ - విండ్ ఎనర్జీ జోన్లు, రూ.820 కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. అలాగే రూ.1,880 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుడతారు. ఈ రహదారి ప్రాజెక్టులతో విజయవాడలో ట్రాఫిక్ రద్దీతోపాటు విశాఖ - హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందని వెల్లడించింది. దీంతోపాటు ప్రాంతీయ అనుసంధానం మెరుగుపడుతుందనే విషయాన్ని ప్రస్తావించింది. భోగాపురం నుంచి మైసూరు వెళ్లనున్న ప్రధాని స్వామి వివేకానంద సాంస్కృతిక యువ కేంద్రం వివేక స్మారకను ప్రారంభిస్తారని ప్రధానమంత్రి కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది.

48 గంటల పాటు 'నో ఫ్లయింగ్ జోన్' : మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విమానాశ్రయం పరిసరాలను 48 గంటల పాటు 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటిస్తూ కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఎయిర్‌పోర్ట్, సభా వేదిక, హెలిప్యాడ్ పరిసరాల చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో గురువారం రాత్రి ఎనిమిది నుంచి శనివారం రాత్రి ఎనిమిది గంటల వరకు ఇది అమల్లో ఉంటుందని చెప్పారు. డ్రోన్లు, మానవరహిత విమానాలు, పారా-గ్లైడర్స్, మైక్రో-లైట్‌ఎయిర్‌క్రాఫ్ట్‌లు తదితర వాటిపై నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. 4,800 బస్సుల ఏర్పాటు: విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగే సభకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల పరిధిలోని 34 నియోజకవర్గాల నుంచి ప్రజలు తరలి రానున్నారు. రెండు వేల ఆర్టీసీ బస్సులు, మరో 2,800 ప్రైవేటు బస్సుల్లో ప్రజలు రానున్నారు. విమానాశ్రయం ప్రారంభోత్సవం నేపథ్యంలో ఆగస్టు 1న అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పీఎం భారీ బహిరంగసభ నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతీయ రహదారిపై వేల వాహనాలు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. అత్యవసరమైతే తప్ప ఎన్‌హెచ్ మీదుగా రావొద్దని స్పష్టం చేశారు.

## ఉద్యమయోధుడికి జన నివాళి

మొదటి పేజీ తరువాయి

ఆదేశాల మేరకు నిర్వహించిన అంతిమ సంస్కార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాలతో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. అంతిమయాత్ర సందర్భంగా ప్రభుత్వ అధికారిక లాంఛనాల్లో భాగంగా గౌరవ వందనం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. తన ఆప్తమిత్రుడిని కడసారి చూసి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కన్నీటిపర్యంతమయ్యారు. అంతిమయాత్రలో మంత్రి సీతక్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎర్రబెల్లి, పల్లా, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, అధికారిక లాంఛనాల్లో భాగంగా అంత్యక్రియల సమయంలో తుపాకులు పేలలేదు. చివరి నిమిషంలో అంత్యక్రియలు అధికారికంగా నిర్వహిస్తున్నట్టు ప్రకటించడం, నిర్వహణ లోపం వల్లనే తుపాకులు పేలలేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

### కేసీఆర్ వెంటే..

తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కేసీఆర్ వెన్నంటే ఉన్నారు. వరంగల్ జిల్లా నుంచి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ సాధనకు అండగా నిలిచిన ఆదర్శ నాయకుడైన సుదర్శన్ రెడ్డి, 1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి గ్రామంలో జన్మించారు. ఆయన 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బీఆర్ఎస్) తరఫున జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్పీటీసీ) సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2004లో టీఆర్ఎస్ జిల్లా పార్టీ కన్వీనర్‌గా ఎన్నికై, ఆ తర్వాత 2002లో రాష్ట్ర పార్టీ కన్వీనర్‌గా నామినేట్ అయ్యారు. ఆయన ఎనిమిదేళ్లకు పైగా టీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి, ఆ తర్వాత పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నామినేట్ అయ్యారు.

## రంగనాథ్‌ను వెంటనే తప్పించండి

మొదటి పేజీ తరువాయి

కేసులో ఈ సంచలన ఉత్తర్వులు వెలువరించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లోతుకుంటలోని వివాదాస్పద భూమి వ్యవహారంలో గతంలో హైడ్రా తరఫున కోర్టుకు ఇచ్చిన హామీని అధికారులు ఉల్లంఘించారని హైకోర్టు స్పష్టం చేసింది. ఆస్తిలోకి ప్రవేశించబోమని.. ఎలాంటి జోక్యం చేసుకోబోమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినప్పటికీ.. అనంతరం భారీ పోలీసు బలగాలు, జేసీబీలు, సిబ్బందితో అక్కడికి వెళ్లి తాత్కాలిక నిర్మాణాలను తొలగించడం కోర్టు ధిక్కరణేనని పేర్కొంది. ఈ సందర్భంగా హైకోర్టు.. హైడ్రాపై ఘాటైన వ్యాఖ్యలు చేసింది. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. వ్యక్తుల పాలన కాదు.. చట్ట పాలనే కొనసాగాలి అని స్పష్టం చేసింది. వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే అది ప్రజాస్వామ్యానికి మరణశాసనం రాసినట్లేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తాతా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఈ సందర్భంగా హైకోర్టు ప్రస్తావించింది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం ప్రతి ప్రభుత్వ అధికారి రాజ్యాంగబద్ధ బాధ్యత అని గుర్తుచేసింది. చట్టం ముందు ఎవరూ అతీతులు కారని స్పష్టం చేసింది. అలాగే ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని ధర్మాసనం పేర్కొం ది. కోర్టు ఒత్తిడి తర్వాత సమర్పించిన క్షమాపణ అఫిడవిట్‌ను అంగీ కరించలేమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగ నాథ్‌ను తక్షణమే ఆ బాధ్యతల నుంచి తప్పించి.. చట్టానికి లోబడి వ్యవ హరించే అధికారిని నియమించాలని సీఎస్‌కు హైకోర్టు తేల్చి చెప్పింది.

## నవంబర్ 30 వరకు ఎల్ఆర్ఎస్ గడువు

మొదటి పేజీ తరువాయి

ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25.70 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే.. ఫీజుల చెల్లింపులు, దరఖాస్తుల పరిష్కారం ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజులపై మొదట 50 శాతం.. ఆ తర్వాత 25 శాతం రాయితీ ప్రకటించింది. ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించినప్పటికీ ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. మరోవైపు.. ఫీజులు చెల్లించిన దరఖాస్తులను కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా.. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్లానింగ్ అధికారులు.. ఇతర సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ఆలస్యమైంది. ఎల్ఆర్ఎస్ ద్వారా దాదాపు రూ.10 వేల కోట్ల ఆదాయం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేయగా, రూ.2 వేల కోట్ల మేరకే వసూలైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారులకు మరో అవకాశం కల్పిస్తూ ఆగస్ట్ 1వ తేదీ నుంచి నవంబర్ 30 వరకు నాలుగు నెలల పాటు గడువు పొడిగించింది. ఇప్పటికే ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని ఫీజులు చెల్లించనివారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది. సంబంధిత శాఖలు ఉత్తర్వులను వెంటనే అమలు చేసి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

## పెళ్లైనా.. కూతుళ్లకు కారుణ్య ఉద్యోగం!

మొదటి పేజీ తరువాయి

అది రాజ్యాంగబద్ధం కాదు. వివాహం తర్వాత కుమార్తెకు పుట్టింటితో బంధం తెగిపోతుందని, ఆమె కేవలం భర్తపైనే ఆధారపడి జీవిస్తుందని భావించడం తగదు" అని అభిప్రాయపడింది. కేవలం సాంకేతిక కారణాలను సాకుగా చూపి దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని స్పష్టం చేసింది. మృతుడి సోదరుడు తొలుత అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, అనంతరం నిరభ్యంతర పత్రం సమర్పించిన విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. పాట్నా హైకోర్టు ఉత్తర్వులను, బీహార్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసిన సుప్రీంకోర్టు పిటిషనర్ అభ్యర్థనను ఎనిమిది వారాల్లోగా మెరిట్ ప్రాతిపదికన పునఃపరిశీలించాలని అధికారులను ఆదేశించింది. కారుణ్య నియామకాలకు కుటుంబ ఆర్థిక స్థితిగతులు, అవసరాలే ప్రామాణికం కావాలని, వివాహ స్థితి కాదని ఈ తీర్పు ద్వారా సర్వోన్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది.

# ఏపీలో 45 లక్షల ఓట్లు తొలగింపు

మొదటి పేజీ తరువాయి

శాశ్వతంగా చిరునామా మారిన లేదా అందుబాటులో లేని వారు 22.30 లక్షల మంది ఉన్నారు. మరణించిన వారివి 15.22 లక్షల ఓట్లు కాగా, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్న 7.37 లక్షల మంది ఓట్లను కూడా తొలగించారు. ఈ సవరణ ప్రక్రియను జూన్ 15 నుంచి జూలై 24 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పకడ్బందీగా నిర్వహించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 4,16,27,694 మంది ఓటర్లకు గాను 3.71 కోట్ల మంది (89.22%) నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించారు. మిగిలిన 44.89 లక్షల మంది ఓటర్లు వారి చిరునామాలో అందుబాటులో లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం, ఫారాలు సమర్పించకపోవడం లేదా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాల వల్ల వారి వివరాలను సేకరించలేకపోయినట్లు సీఈఓ వివరించారు. అయితే, జాబితా నుంచి పేర్లు తొలగిపోయిన అర్హులైన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అలాంటి వారు తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించారు. ఇవాళ్టి నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. అర్హులైన వారు నిర్దేశిత డిక్లరేషన్ ఫారంతో పాటు ఫారం-6ను సమర్పించి, తమ పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్న వారి పేరును వారు కోరుకున్న ఒక్క చోట మాత్రమే ఉంచుతారు. ప్రజల సౌలభ్యం కోసం తొలగించిన ఓటర్ల జాబితాను రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఈఆర్ఓ/ఏఈఆర్ఓ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శనకు ఉంచారు. అలాగే, సీఈఓ, జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో కూడా ఈ జాబితాలు అందుబాటులో ఉన్నాయి. వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు పరిష్కరించి, అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామని

## పీఎం కిసాన్.. ఐదేళ్లు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

కిసాన్ పథకం పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రైతులకు మరో 5 సంవత్సరాల పాటు పెట్టుబడి సాయం అందించాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ నేతృత్వంలోని మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. కోట్లాది మంది రైతులకు ఈ నిర్ణయం లబ్ది చేకూర్చుతుందని చెప్పారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా దేశంలోని అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6000 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. అయితే, ఒకేసారి కాకుండా రూ.2000 చొప్పున మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో నేరుగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు 23 విడతల్లో నిధులు జమ చేశారు. ఖరీఫ్ పంట సాగు నడుస్తున్న క్రమంలో రైతులు 24వ విడత నిధుల కోసం వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో పీఎం కిసాన్ స్కీమ్‌పై కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో ఈ సారి కిసాన్ నిధులు త్వరలోనే అందనున్నాయి. అటు.. వచ్చే 5 సంవత్సరాల్లో 5000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి సూర్య సరోవర్ యోజన పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.5070 కోట్లు కేటాయించింది. అలాగే ఖేలో ఇండియాకు రూ.29 వేల కోట్లు, సముద్ర మంథణ్ పథకానికి రూ.84 వేల కోట్లు కేటాయించారు. సొరంగాల నిర్మాణం కోసం రూ.9779 కోట్లు కేటాయించారు.

## రేషన్ ఈ-కేవైసీ గడువు.. ఆగస్టు 31

మొదటి పేజీ తరువాయి

తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 'స్మార్ట్' ప్రక్రియ, పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే గడువు పెంచినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రేషన్ కార్డుదారులకు మరో శుభవార్త కూడా ఉంది. ఈ-కేవైసీ పూర్తయిందా లేదా అన్న దానితో సంబంధం లేకుండా శనివారం నుంచి మూడు నెలల బియ్యం, ఇతర రేషన్ సరకులను ఒకేసారి పంపిణీ చేయనున్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేయని వారు ఆగస్టు 31లోపు సమీప రేషన్ దుకాణంలో ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

## ఫసల్ బీమా గడువు.. ఆగస్టు 15

మొదటి పేజీ తరువాయి

కార్యాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) లేదా అధికారిక పీఎంఎఫ్‌బీవై పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలు, కరువు, తుఫాన్లు తదితర కారణాలతో పంటలు దెబ్బతిన్న సందర్భాల్లో అర్హత కలిగిన రైతులకు ఆర్థిక పరిహారం అందించడంలో ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. గడువు ముగిసేలోపు రైతులందరూ తప్పనిసరిగా పంటల బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకుని ప్రభుత్వ పథకం ప్రయోజనాలను పొందాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

## ఎస్ఐఆర్ గడువు.. ఆగస్టు 10

మొదటి పేజీ తరువాయి

కీలక సూచనలు చేస్తున్నారు. నిజానికి మొదట ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు ఎన్యూమరేషన్ గడువు జూలై 24వ తేదీతో ముగియనుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే రాష్ట్రంలోని పలు రాజకీయ పార్టీల విజ్ఞప్తుల మేరకు మొదటిసారి ఆగస్ట్ 3వ తేదీ వరకు గడువును పెంచిన కేంద్ర ఎన్నికల సంఘం.. తాజాగా మరోసారి ఆగస్ట్ 10వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగియకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తి అయిందని తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్‌లో 56.31 శాతం.. రంగారెడ్డి జిల్లాలో 63.43 శాతం.. మేడ్చల్-మల్కాజిగిరిలో 61.37 శాతం మాత్రమే ప్రక్రియ పూర్తి అయింది. ఇంకా గణనీయ సంఖ్యలో ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాల్సి ఉండటంతో గడువు పెంపు అవసరమైంది. ఆగస్ట్ 10వ తేదీ వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ కొనసాగనుండగా.. అదే రోజు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. ఆ తర్వాత ఆగస్ట్ 10వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన చేపట్టనున్నారు. అన్ని అభ్యంతరాల పరిష్కారం అనంతరం అక్టోబర్ 12వ తేదీన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించనుంది.

## ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ షురూ

మొదటి పేజీ తరువాయి

సభ్యుల పూర్తి వివరాలను ఒకే ధ్రువీకరణ పత్రంలో అందించేలా ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు లేదా ఇతర సంస్థలు కుటుంబ వివరాలు కోరినప్పుడు ఈ ఫ్యామిలీ సర్టిఫికెట్ అధికారిక ధ్రువపత్రంగా ఉపయోగపడుతుందని వివరించారు. ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యుల పేర్లు, కుటుంబ యజమానితో ఉన్న సంబంధం, వయస్సు, పుట్టిన తేదీ, లింగం, ఆధార్ నంబర్, ప్రస్తుత నివాస చిరునామా వంటి పూర్తి వివరాలు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమాచారం అధికారిక రికార్డుల ఆధారంగా సిద్ధం చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఫ్యామిలీ సర్టిఫికెట్ ప్రక్రియను రేషన్ కార్డు డేటాతో అనుసంధానం చేశారు. ఫుడ్ సెక్యూరిటీ కార్డు డేటాబేస్‌లో ఉన్న వివరాల ఆధారంగా ప్రతీ కుటుంబానికి ప్రత్యేక ఫ్యామిలీ రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నంబర్ కేటాయించనున్నారు. సాధారణంగా రేషన్ కార్డు నంబరునే ఈ గుర్తింపు సంఖ్యగా పరిగణిస్తారు. దీంతో కుటుంబ వివరాల ధ్రువీకరణ మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుంది. ఫ్యామిలీ సర్టిఫికెట్ పొందాలనుకునే వారు సమీపంలో ఉన్న మీ సేవా కేంద్రాలు, మీ సేవ ఆన్‌లైన్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా నిర్ణీత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఒక కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన ఏ సభ్యుడైనా ఈ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే అర్హత కలిగి ఉంటారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన తర్వాత సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయం ఆ అప్లికేషన్‌ను పరిశీలించి సర్టిఫికెట్ జారీ చేస్తుందని స్పష్టం చేశారు.

# సర్ దరఖాస్తుల్లో తప్పులు

## ఓటర్లకు తీవ్ర ఇబ్బందులు: జయశ్రీ



జగిత్యాల, జూలై 31 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో పలు లోపాలు చోటుచేసుకుంటున్నాయని మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బీఎల్ఓల ద్వారా ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని, కొన్ని దరఖాస్తులు మిస్ అవుతున్నాయని తెలిపారు. దీంతో అధికారులు మళ్లీ దరఖాస్తులు సమర్పించాలని కోరుతుండటంతో ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు గడువు సమీపిస్తుండటం, 2002 సంవత్సరానికి సంబంధించిన వివరాలు గుర్తులేకపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ మ్యాపింగ్‌లోనూ తప్పులు జరుగుతున్నాయని జయశ్రీ పేర్కొన్నారు. ఓటర్ల కుటుంబానికి సంబంధించిన బీఎల్ఓ వద్ద కాకుండా ఇతర గ్రామాలు, పట్టణాలకు చెందిన బీఎల్ఓల వద్ద మ్యాపింగ్ అవుతుండటంతో స్థానికంగా ఓటర్ల పేర్లు కనిపించక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత బీఎల్ఓలకు ఫోన్ చేసినా స్పందించడం లేదని, దీంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతి ఓటరు దరఖాస్తును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు, ఓటరు పేరు ఉన్న బూత్‌లోనే మ్యాపింగ్ జరిగేలా, సంబంధిత కుటుంబానికి చెందిన బీఎల్ఓ వద్దే ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జయశ్రీ కలెక్టర్‌ను కోరారు.

# జెన్ జీకి రేవంత్ అవమానం

## సీఎంపై కిషన్ రెడ్డి ఫైర్

హైదరాబాద్, జూలై 31 (ఈవార్తలు): ఇటీవల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని మండిపడ్డారు. ఇది సరైన పద్ధతి కాదని... యువతను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారనే అక్కసుతోనే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలకు దిగారని ఆయన ఆరోపించారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని కిషన్ రెడ్డి చెప్పారు. విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. జెన్ జీ ఆకాంక్షలకు, భావాలకు వ్యతిరేకంగా పాలకులు వెళ్లడం సరికాదని హితవు పలికారు. రేవంత్ రెడ్డి విద్యార్థులపై నిందలు వేయడం మాని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన విద్యా సంస్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు.

# భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

భద్రాచలం, జూలై 31 (ఈవార్తలు): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం అధికారులు 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిప్రవాహం గంటగంటకూ పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, తెలంగాణలోని ప్రధాన జలాశయాలన్నీ వరద నీటితో నిండుకుండలా మారాయి. కడెం ప్రాజెక్టు నీటిమట్టం 698.02 అడుగులకు (పూర్తి స్థాయి 700 అడుగులు) చేరగా, 10,282 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదవుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి 70 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, నీటిమట్టం 1069 అడుగుల వద్ద ఉంది. ఇక శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.30 మీటర్లకు చేరుకుంది. ఎల్లంపల్లిలోకి 1,32,785 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో, అంతే మొత్తంలో (1,32,785 క్యూసెక్కులు) నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 18,445 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయాల నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో ప్రాజెక్టుల వద్ద యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోంది.

# సీదిరి అప్పలరాజు బెయిల్ పిటిషన్ కొట్టివేత

శ్రీకాకుళం, జూలై 31 (ఈవార్తలు): ఏపీ మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజుకు కోర్టులో చుక్కెదురైంది. తన కుమారుడు చేసిన రోడ్డు ప్రమాదం కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలను తారుమారు చేశారన్న ఆరోపణలపై అరెస్టయిన ఆయనకు న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. సీదిరి అప్పలరాజు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను కోర్టు శుక్రవారం కొట్టివేసింది. దీంతో ఆయన జైల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. జులై 10వ తేదీన శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పాత జాతీయ రహదారిపై అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ నడుపుతున్న బైక్, దానయ్య (45) అనే గొర్రెల కాపరిని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో దానయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే అప్పలరాజు తన కుమారుడిని అక్కడి నుంచి కారులో తప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేని కొడుకును రక్షించేందుకు, తన అనుచరుడైన సిద్ధార్థ్ అనే యువకుడితో తానే ప్రమాదం చేశానని పోలీసుల ముందు లొంగిపోయేలా నాటకం ఆడించారని పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి ముందు సమీపంలోని పెట్రోల్ బంకులో ఆరవ్ వర్మ తన బైక్‌లో పెట్రోల్ నింపుతున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డ్ కావడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేశారు. పోలీసులను తప్పుదోవ పట్టించడం, సాక్ష్యాలను నాశనం చేయడం, బాధితుడి కుటుంబంపై ఒత్తిడి తేవడం వంటి అభియోగాలతో ఈ కేసులో అప్పలరాజును మూడో నిందితుడిగా (ఏ3) చేర్చారు. జులై 22న ఆయన్ను అరెస్ట్ చేయగా, ప్రస్తుతం అంపోలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. తాజాగా బెయిల్ పిటిషన్ కూడా తిరస్కరణకు గురికావడంతో ఆయన జైల్లోనే కొనసాగనున్నారు.

# నాపై కావాలనే కుట్ర

## హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్, జూలై 31 (ఈవార్తలు): తెలంగాణ హైకోర్టు తనకు నెల రోజుల జైలు శిక్ష విధించిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారంపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఉన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు, మీడియా ప్రతినిధులు అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల హైడ్రాకు సంబంధించిన అంశాలపై పలు వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో.. ఏవీ రంగనాథ్ పేరుతో మరో ప్రచారం వేగంగా వైరల్ అయింది. తెలంగాణ హైకోర్టు ఆయనకు నెల రోజుల జైలు శిక్ష విధించిందని.. కోర్టు ధిక్కరణ కేసులో కఠిన చర్యలు తీసుకుందని కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అయ్యాయి. వాటికి సంబంధించి కొన్ని మీడియా సంస్థలు కూడా టీవీలు, న్యూస్ వెబ్ సైట్‌లలో కథనాలు కూడా రాశాయి. దీంతో ఆ వార్త శరవేగంగా వ్యాప్తి చెందింది. ఈ నేపథ్యంలోనే తనపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ తాజాగా ఏవీ రంగనాథ్ స్పందించారు. తాను ముందుగా ఊహించినట్లుగానే కొందరు కావాలనే సోషల్ మీడియా వేదికగా తనపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై జరుగుతుంది పూర్తిగా ఫేక్ న్యూస్ అని కొట్టిపారేశారు. అందులో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇక ఏవీ రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు.. సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. మరీ ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని భావించి షేర్ చేయకుండా.. సంబంధిత శాఖలు లేదా ప్రభుత్వ అధికారిక వర్గాల నుంచి వచ్చే ప్రకటనలనే నమ్మాలని సూచించారు. అధికారిక ధృవీకరణ లేకుండా వైరల్ అయ్యే వార్తలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అసత్య ప్రచారాలకు ప్రాధాన్యం ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు.



# జూరాలకు భారీగా వరద..28 గేట్లు ఎత్తివేత

**మహబూబ్‌నగర్, జూలై 31 (ఈవార్తలు): మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు తరలివస్తుంది . ఎగువ నుంచి 1,46,000 క్యూసెక్కుల నీరు వస్తుండగా అప్రమత్తమైన ఇంజినీరింగ్ అధికారులు 28 గేట్లను ఎత్తి దిగువకు 1,33,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.దీంతో శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతోంది.**

# పెట్టుబడులకు తెలంగాణ గమ్యం

## సీఐఐ ప్రతినిధుల సమావేశంలో రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 31 (ఈవార్తలు): పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన రాష్ట్రమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నార్తర్న్ రీజనల్ కౌన్సిల్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "నాయకులు, పార్టీలు మారవచ్చు కానీ, గత ప్రభుత్వాలు చేపట్టిన మంచి పనులను మేం కొనసాగిస్తాం" అని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు హయాంలో బిల్ గేట్స్, బిల్ క్లింటన్ వంటి అంతర్జాతీయ ప్రముఖులను హైదరాబాద్‌కు రప్పించి పెట్టుబడులను ఆకర్షించిన తీరును ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలోనే అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వంటి ప్రాజెక్టులు సాకారమయ్యాయని తద్వారా ఫార్మా ఐటీ రంగాలు మరింత విస్తరించాయని తెలిపారు. తమ పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదని, తయారీ రంగంలో చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలతో పోటీ పడుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నగరాల పరంగా టోక్యో, న్యూయార్క్ వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడుతున్నామని ఆయన అన్నారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. కేంద్రం ప్రకటించిన ఏడు బుల్లెట్ రైలు ప్రాజెక్టుల్లో మూడు (శంషాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరు) తెలంగాణకు రానున్నాయని వెల్లడించారు. రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా తరలివస్తున్నాయని, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు సుమారు 200 కంపెనీలు ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. డేటా సెంటర్ల స్థాపన కోసం అమెజాన్ సంస్థ రూ.1 లక్ష కోట్లు, అదానీ గ్రూప్ రూ.35,000 కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయని వివరించారు. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి ప్రపంచ ప్రఖ్యాత 500 కంపెనీలను తీసుకురావడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# భోగాపురం ఎయిర్ పోర్టు థింసా నృత్యం.. గిన్నిస్ బుక్ రికార్డు



విజయనగరం, జూలై 31 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో గిరిజన విద్యార్థినులు, మహిళలు చారిత్రాత్మక ఘనత సాధించారు. సుమారు 13,000 మంది ఏకకాలంలో సంప్రదాయ థింసా నృత్యం చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డును నెలకొల్పారు. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణం ఈ అద్భుత ప్రదర్శనకు వేదికగా నిలిచింది. రేపు ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయనకు 13 వేల మందితో థింసా నృత్యం ప్రదర్శించడం ద్వారా స్వాగతం పలకనున్నారు. అందుకు సన్నాహకంగా ఇవాళ థింసా నృత్య ప్రదర్శన రిహార్సల్ చేపట్టారు. మన్యం ప్రాంత గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ సంకీర్ణ ప్రభుత్వం ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో వివిధ ఐటీడీఏ పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు. వారంతా సంప్రదాయబద్ధంగా గులాబీ రంగు, ఆకుపచ్చ అంచు చీరలను ధరించి, ఎంతో లయబద్ధంగా థింసా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ఈ మహా ప్రదర్శనను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారులు అక్కడే ఉండి పర్యవేక్షించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ప్రదర్శన జరిగిందని నిర్ధారించుకున్న తర్వాత, దీనిని అధికారికంగా ప్రపంచ రికార్డుగా ప్రకటించారు. ప్రభుత్వ పక్షాన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

# సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు



హైదరాబాద్, జూలై 31 (ఈవార్తలు): సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌కి దివంగత మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి పేరు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ స్థానంలో మర్రి చెన్నారెడ్డి పేరు మారుస్తూ ప్రభుత్వం తీసుకుంది. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స్' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

# ఇథనాల్ కలపకుంటే పెట్రోల్ రూ.125 అయ్యేది: కేంద్రం

న్యూఢిల్లీ: పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం కలపకపోయి ఉంటే ఇటీవల పశ్చిమాసియా సంక్షోభం సమయంలో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర దాదాపు రూ.125కు చేరేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇథనాల్ బ్లెండింగ్ వల్ల అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినా వినియోగదారులపై భారం పడలేదని పేర్కొంది. ఈ విధానం కారణంగా లీటర్‌కు దాదాపు రూ.30 వరకు ఆదా అయ్యిందని కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో భారత క్రూడాయిల్ బాస్కెట్ ధర బ్యారెల్‌కు 135 డాలర్ల వరకు చేరిందని తెలిపింది. ఆ పరిస్థితిలో ఇథనాల్ మిశ్రమం లేకుంటే పెట్రోల్ ధర రూ.125కు చేరేదని వివరించింది. అయితే ప్రస్తుతం ప్రతి లీటర్‌లో 20 శాతం దేశీయంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌ను కలపడం వల్ల ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.94.77కే పరిమితమైందని పేర్కొంది. ఇథనాల్ బ్లెండింగ్‌తో ముడిచమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గుతోందని కేంద్రం వెల్లడించింది. ఇప్పటివరకు ఈ కార్యక్రమం వల్ల రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అయినట్లు తెలిపింది. అలాగే 950 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలు తగ్గాయని పేర్కొంది. రైతులు, డిస్టిలరీలకు రూ.1.66 లక్షల కోట్లకుపైగా చెల్లింపులు జరిగాయని వెల్లడించింది.

# పాకిస్థాన్‌లో బొగ్గు గనిలో పేలి 15 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని సోరేంజ్ బొగ్గు క్షేత్రంలో ఉన్న ఒక ప్రైవేట్ బొగ్గు గనిలో మీథేన్ గ్యాస్ పేలడంతో కనీసం 15 మంది కార్మికులు మరణించారు. మరో 24 మందికి పైగా కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఈ దుర్ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదం జరిగిన సమయంలో భూమికి దాదాపు 4,000 అడుగుల లోతున 24 మంది కార్మికులు పనిచేస్తున్నారు. గనిలో మీథేన్ గ్యాస్ పేరుకుపోయి ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. దీంతో గనిలో మంటలు చెలరేగి పైకప్పు కూలిపోయింది. ఈ ప్రమాద ప్రభావం సమీపంలోని మరో గనిపై కూడా పడింది. ఫలితంగా అక్కడ పనిచేస్తున్న మరో 12 మంది కార్మికులు కూడా చిక్కుకుపోయారు. ప్రమాద సమయంలో రెండు గనుల్లో కలిపి మొత్తం 36 మంది కార్మికులు ఉన్నారని చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్ మహ్మద్ ఆతిఫ్ తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే మైన్స్ అండ్ మినరల్స్ డిపార్ట్‌మెంట్, ప్రావిన్షియల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (పీడీఎంఏ) బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. గని లోపల ప్రమాదకర వాయువులు పేరుకుపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని, గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోందని ఆయన వివరించారు. పాకిస్థాన్ బొగ్గు గనుల్లో భద్రతా లోపాల కారణంగా ప్రమాదాలు జరగడం సాధారణమైపోయింది. గత మే నెలలో ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన రెండు వేర్వేరు గని ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు మరణించారు. గనుల్లో కార్మికులకు కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల ప్రాణాలను కాపాడాలని స్థానికులు, కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



## వర్షాలతో దెబ్బతిన్న బ్రిడ్జి

**పరిశీలించిన కోరుట్ల ఎమ్మెల్యే**

కోరుట్ల, జూలై 31 (ఈవార్తలు): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలోని లో-లెవెల్ బ్రిడ్జిని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల డాక్టర్ సంజయ్ పరిశీలించారు. బ్రిడ్జి పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే.. ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని కోరారు. బ్రిడ్జి దెబ్బతినడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాల కారణంగా మిషన్ భగీరథ ప్రధాన పైపులు సైతం దెబ్బతిని తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సంబంధిత గ్రామాలకు వీలైనంత త్వరగా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

## పెద్ది మృతి తీరని లోటు: జీవన్ రెడ్డి



జగిత్యాల, జూలై 31 (ఈవార్తలు): నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆకస్మిక మృతి పట్ల మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం ప్రజా జీవితానికి తీరని లోటని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమ స్ఫూర్తితో పనిచేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన కృషి చిరస్మరణీయమని జీవన్‌రెడ్డి కొనియాడారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు వారికి ప్రసాదించాలని ఆకాంక్షించారు. దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి**

డీజిల్ ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన డీజిల్ ఆటో సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఆటో యూనియన్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకున్న జీవన్‌రెడ్డి.. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. ఆర్టీఏ నిబంధనలు కఠినంగా అమలవుతున్న నేపథ్యంలో ప్రతి ఆటో డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలను సక్రమంగా నిర్వహించుకోవాలని తెలిపారు. లైసెన్స్‌ల పునరుద్ధరణ, రవాణా నిబంధనల పాటింపు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కార్మికులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సంఘం బలోపేతంతోనే ఆటో కార్మికుల హక్కులు పరిరక్షించబడతాయని పేర్కొంటూ, వారి సంక్షేమానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.



## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్**

ధర్మపురి, జూలై 31 (ఈవార్తలు): భారీ వర్షాల నేపథ్యంలో ధర్మపురి మండలం రాయపట్నం వద్ద గోదావరి వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. నీటిమట్టం, వరద ప్రవాహ పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు, నదీ తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వరద పరిస్థితిపై నిరంతరం నిఘా ఉంచి శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మత్స్యకారులు గోదావరిలోకి వెళ్లవద్దని, ప్రజలు వరద ప్రవాహాన్ని చూసేందుకు నదీ తీరాలకు చేరుకోవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ పత్తి రవీందర్ పాల్గొన్నారు.



## వైద్య ఖర్చులకు ఫేస్‌బుక్ మిత్రుల రూ.1.27 లక్షల విరాళం

ధర్మపురి, జూలై 31 (ఈవార్తలు): షుగర్ వ్యాధితో కాలు తొలగించడంతో పాటు పక్షవాతం బారినపడి మంచానికే పరిమితమైన ధర్మపురి ఇందిరమ్మ కాలనీకి చెందిన నూగురి సత్యనారాయణ వైద్య ఖర్చుల కోసం ఫేస్‌బుక్ మిత్రులు రూ. 1.27 లక్షల విరాళం అందించారు. గతంలో చిన్న హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించిన సత్యనారాయణకు నాలుగేళ్ల క్రితం షుగర్ కారణంగా కాలు తొలగించారు. మూడు నెలల క్రితం పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమయ్యారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న సామాజిక సేవకుడు రేణుకంట రమేష్ ఫేస్‌బుక్‌లో సాయం కోరడంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు స్పందించి బాధితుడి భార్య విజయ బ్యాంకు ఖాతాకు విరాళాలు పంపించారు. ఈ మొత్తాన్ని స్థానిక సీఐ రాంనర్సింహారెడ్డి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ మాధవరావుతో కలిసి శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. సాయం అందించేందుకు కృషి చేసిన రమేష్‌ను పలువురు అభినందించారు.

# అల్లుడే ఇంటి వాసాలు లెక్కపెట్టాడు!

**బాధితుడి అల్లుడు, మనవడే మాస్టర్‌మైండ్లు.. మీరట్‌లో ముగ్గురు నిందితుల అరెస్ట్**

**నగదు, బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం**

**కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు**

కరీంనగర్, జూలై 31 (ఈవార్తలు): కరీంనగర్ భగత్‌నగర్‌లో ఇటీవల జరిగిన సంచలనాత్మక ఇంటి దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ ఇంట్లో జూలై 21/22 అర్ధరాత్రి జరిగిన ఈ దోపిడీకి బాధితుడి అల్లుడు మొహమ్మద్ రజావుద్దీన్ (ఏ1), మనవడు మొహమ్మద్ అజీమ్ రజా (ఏ2) ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. వీరు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మరో ముగ్గురు సహచరులతో కలిసి దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా మీరట్‌లో ప్రత్యేక గాలింపు చేపట్టిన కరీంనగర్ పోలీసు బృందాలు, అక్కడి పోలీసుల సహకారంతో-ఏ3 సల్మాన్ ఏ భూరే,-ఏ4 సల్మాన్ ఏ విమాన్,-ఏ5 మొహమ్మద్ హసీన్‌ను అరెస్ట్ చేశాయి. వారి వద్ద నుంచి రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దోపిడీ అనంతరం నిందితులు ఇంటి ఆవరణలో ఉన్న రెండు మోటార్‌సైకిళ్లను అపహరించి హుజూరాబాద్ వైపు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. వివిధ ప్రాంతాల సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక, డిజిటల్ ఆధారాలను విశ్లేషించగా వారు పెద్దపాపయ్యపల్లి సమీపంలో బైక్‌లను వదిలేసి పరారైనట్లు తేలింది. ఈ ఆధారాల ఆధారంగానే నిందితుల జాడను గుర్తించి మీరట్ వరకు చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, బాధితుడి అల్లుడు రజావుద్దీన్‌కు భార్యతో కుటుంబ విభేదాలు ఏర్పడ్డాయి. వ్యాపారంలో నష్టపోయిన అతను తరచూ డబ్బులు కోరగా కుటుంబ సభ్యులు నిరాకరించారు. ఇటీవల రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసి తిరస్కరణ ఎదురుకావడంతో ఇంట్లో దోపిడీకి పథకం రచించాడు. బాధితుడి ఇంట్లో కొంతకాలం నివసించడం వల్ల ఇంటి నిర్మాణం, నగదు, నగలు భద్రపరిచే ప్రదేశాలపై పూర్తి సమాచారం ఉండటాన్ని నేరానికి ఉపయోగించుకున్నట్లు పోలీసులు తెలిపారు.




పథకం ప్రకారం నిందితులు మీరట్ నుంచి రామగుండం చేరుకుని, జూలై 21/22 అర్ధరాత్రి డమ్మీ పిస్టళ్లు, కత్తులతో ఇంట్లోకి ప్రవేశించారు. కుటుంబ సభ్యులను బెదిరించి చేతులు, కాళ్లు కట్టి నగదు, బంగారం, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్లను దోచుకెళ్లారు. అనంతరం రెండు మోటార్‌సైకిళ్లను కూడా తీసుకుని పరారయ్యారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించిన దర్యాప్తు అధికారులు, ప్రత్యేక పోలీసు బృందాలను పోలీస్ కమిషనర్ అభినందించారు. అలాగే నిందితుల అరెస్టులో సహకరించిన మీరట్ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

**చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాలలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమం**

వేములవాడ అర్బన్, జూలై 31 (ఈవార్తలు): మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ తన 56వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి శ్రీరామ్ మొండయ్య, వేములవాడ రూరల్ మండల విద్యాధికారి కిషన్ చేతుల మీదుగా పాఠశాలలోని 90 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. జిల్లా విద్యాధికారి శ్రీరామ్ మొండయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకుని విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను అందించడం అభినందనీయమని అన్నారు. చిన్నదైనా, పెద్దదైనా సేవా కార్యక్రమాలకు దాతలను ప్రోత్సహించడం గొప్ప విషయమని కొనియాడారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే తప్పకుండా విజయం సాధిస్తారని సూచించారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ,



దాతల సహకారంతో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలతో పాటు నిరుపేదలకు వైద్య సహాయం, పేద కుటుంబాల బాలికల వివాహాలు, అంత్యక్రియల ఖర్చులు, విద్యా సహాయం వంటి సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 86 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 10,44,281 ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. ట్రస్ట్ సేవలకు సహకరిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీరామ్ మొండయ్య, వేములవాడ రూరల్ మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు కిషన్, పాఠశాల సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, డాక్టర్ రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, వొద్యాల వేణు, పసుల శ్రీధర్, పొలాస రాజేందర్, మధు, కవిత తదితరులు పాల్గొన్నారు.



## జియో ఉద్యోగి మనోజ్‌కు రూ.20 వేల ఆర్థిక సాయం

వేములవాడ అర్బన్, జూలై 31 (ఈవార్తలు): వేములవాడకు చెందిన జియో క్షేత్ర సేవా ప్రతినిధి (ఎఫ్ఎస్ఈ) మనోజ్ వైద్య చికిత్స కోసం వేములవాడ సెల్ పాయింట్ యజమానుల సంక్షేమ సంఘం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించింది. సంఘ సభ్యులు స్వచ్ఛందంగా అందించిన విరాళాలతో సమీకరించిన రూ.20 వేల నగదును సంఘం కార్యవర్గ సభ్యుల సమక్షంలో మనోజ్, ఆయన తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, మనోజ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. క్లిష్ట సమయంలో సహచరుడికి అండగా నిలవడం సామాజిక బాధ్యతలో భాగమని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి ఉదారంగా విరాళాలు అందించిన ప్రతి దాతకు సంఘం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోనమ్మగారి రాము, ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రవీణ్, కోశాధికారి ఏడిగ తిరుపతి, సంయుక్త కార్యదర్శులు తాటికొండ శ్రీనివాస్, చేపూరి ప్రణవ్, కార్యవర్గ సభ్యులు సురేందర్, మంచాల శ్రీనివాస్, మల్లేశం, సంతోష్, చెర్రీ, లక్ష్మణ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణమాసంలో రాజన్న దర్శనం కల్పించాలి

**దేవస్థానం ఈవోకు బీజేపీ వినతిపత్రం**

వేములవాడ అర్బన్, జూలై 31 (ఈవార్తలు): వేములవాడ పట్టణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలి సంఘ భవనంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం శ్రావణమాసంలో పట్టణ ప్రజలకు శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కల్పించాలని కోరుతూ దేవస్థానం కార్యనిర్వహణాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, దేవాలయ అభివృద్ధి పనుల సందర్భంగా పట్టణ ప్రముఖులు, అఖిలపక్ష నాయకుల సమక్షంలో నిర్వహించిన దృశ్య ప్రజెంటేషన్‌లో సమ్మక్క--సారలమ్మ జాతర లేదా మహాశివరాత్రి నాటికి రాజన్న దర్శనం కల్పిస్తామని ప్రభుత్వం, దేవాదాయ శాఖ హామీ ఇచ్చాయని గుర్తు చేశారు. అయితే ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కనీసం పవిత్ర శ్రావణమాసంలో అయినా పట్టణ ప్రజలకు స్వామివారి దర్శనం కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



బీజేపీ నాయకుడు ప్రతాప్ రామకృష్ణ మాట్లాడుతూ, ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి జరుగుతుందని ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం చేపడుతున్న పనులు అందుకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. మంత్రులు ప్రారంభోత్సవాలకు మాత్రమే పరిమితమవుతున్నారని, భక్తుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆలయ శిఖరం కనిపించకుండా నిర్మాణాలు చేపట్టడం సముచితం కాదని పేర్కొన్నారు. అభిషేక ప్రియుడైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనం శ్రావణమాసంలో పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, లేకుంటే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ కుమ్మరి శంకర్, రేగుల రాజ్‌కుమార్, కోల కృష్ణస్వామి, పిన్నింటి హనుమంతులు, రేగుల శ్రీకాంత్, మామిండ్ల లక్ష్మీరాజం, బోనాల శివ, వాసం మల్లేశం, గుడిసె మనోజ్, నామాల శేఖర్, మహంకాళి శ్రీనివాస్, బిల్లా కృష్ణ, జవ్వాజీ శేఖర్, చిక్కుడు మల్లేశం, కటకం శ్రీనివాస్, నేరేళ్ల సాయి, సగ్గు రాహుల్, జగన్నాథం శ్రీను, కిరణ్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## అంకితభావంతో సేవలు స్ఫూర్తిదాయకం

**పోలీసుల పదవీవిరమణ కార్యక్రమంలో ఎస్పీ అశోక్**

జగిత్యాల, జూలై 31 (ఈవార్తలు): పోలీసు శాఖలో ఏళ్లపాటు అంకితభావంతో పనిచేసి పదవీ విరమణ పొందిన అధికారుల సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఏఎస్సైలు బి. ఆనందం, ఎం. శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ జి. రవిని ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం కేవలం విధులు నిర్వహించడమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల కోసం సేవలందించిన అధికారుల కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని కొనియాడారు. పదవీ విరమణ సేవలకు ముగింపు కాదని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన అధికారులకు శాలువాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. అనంతరం పోలీసు వాహనంలో వారిని ఎక్కించి పోలీసు బ్యాండ్‌తో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఆర్ఐ కిరణ్‌కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీఖాన్, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీకి షెహ్‌జాద్ పూనావాలా రాజీనామా

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిగా టీవీ చర్చల్లో తరచూ కనిపించే షెహ్‌జాద్ పూనావాలా పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తన 'ఎక్స్' ప్రొఫైల్‌లో 'బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి' అనే ట్యాగ్‌ను తొలగించారు. అయితే 'ప్రధాని నరేంద్ర మోదీ జీవితకాల అనుచరుణ్ని' అనే ట్యాగ్‌లైన్‌ను మాత్రం అలాగే ఉంచారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన షెహ్‌జాద్ తన రాజకీయ ప్రయాణాన్ని కాంగ్రెస్‌లో ప్రారంభించారు. 2017లో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలపై బహిరంగంగా అభ్యంతరం వ్యక్తం చేసి వార్తల్లో నిలిచారు. రాహుల్ గాంధీని అధ్యక్షుడిగా చేయడానికే ఎన్నికల ప్రక్రియ సాగిందని అప్పట్లో ఆరోపించారు.

## రాజన్న జిల్లా మహిళా మోర్చా జిల్లా కమిటీ ప్రకటన

రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 31 (ఈవార్తలు): భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా మోర్చా నూతన జిల్లా కమిటీని జిల్లా కేంద్రంలో ప్రకటించారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి సమక్షంలో కమిటీ సభ్యుల పేర్లను వెల్లడించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా దాసరి పూర్ణిమ (ఎల్లారెడ్డిపేట మండలం), మంత్రి సంతోష (వేములవాడ అర్బన్ మండలం), జిల్లా ఉపాధ్యక్షులుగా రెడ్డబోయిన మనోజ్ఞ (సిరిసిల్ల పట్టణం), భీమనపల్లి శోభ (సిరిసిల్ల పట్టణం), తుమ్మల రాజవ్వ (వేములవాడ అర్బన్ మండలం), జిల్లా కార్యదర్శులుగా ఎక్కలదేవి జమున (గంభీరావుపేట మండలం), గుంటుక మంజుల (సిరిసిల్ల పట్టణం), జొన్నకంటి తేజశ్రీ (ఎల్లారెడ్డిపేట మండలం), జిల్లా అధికార



ప్రతినిధిగా సుధా గోని నిశ్చిత (కోనరావుపేట మండలం), జిల్లా 'మన్ కీ బాత్' కన్వీనర్‌గా గంగాధర మమత (చందుర్తి మండలం)ను నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని పార్టీ నాయకత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహిళా మోర్చా నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

# గ్రామీణ వికాసానికి 'స్టార్టప్' బాట!

## ఎస్వీఈపీతో మారుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థల స్వరూపం.. 4.32 లక్షల స్టార్టప్‌లకు తోడ్పాటు.. 99 శాతం లాభాల బాట

### 75 శాతం మహిళా పారిశ్రామికవేత్తలతో సరికొత్త విప్లవం.. సంక్షేమం నుంచి స్వయం సమృద్ధి వైపు వేగంగా అడుగులు

దేశంలో పట్టణాలకే పరిమితమైన అంకుర సంస్థల(స్టార్టప్) సంస్కృతిని పల్లెలకూ విస్తరిస్తూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు 'స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్' (ఎస్వీఈపీ) కొత్త ఊపిరి పోస్తోంది. దీనదయాళ్ అంత్యోదయ యోజన--జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(డీఏవై--ఎన్ఆర్ఎల్ఎం) అనుబంధంగా పనిచేస్తున్న ఈ పథకం.. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయేతర చిన్న తరహా పరిశ్రమలకు కొండంత అండగా నిలుస్తోంది. శిక్షణ, ఆర్థిక తోడ్పాటు, సాంకేతిక మార్గదర్శకత్వంతో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 4.32 లక్షల గ్రామీణ సంస్థలకు ఎస్వీఈపీ చేయూతనందించింది. సామాజిక సమ్మిళితత్వమే ధ్యేయంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో ఏకంగా 86 శాతం మంది లబ్ధిదారులు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు చెందినవారే కావడం విశేషం.

**నిధుల పెంపుతో బలోపేతమవుతున్న వ్యవస్థ**

గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎస్వీఈపీ నిధులను భారీగా పెంచింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి నిధుల కేటాయింపులను పరిశీలిస్తే.. 2016-18 మధ్య కాలంలో విడుదల చేసిన రూ.112.39 కోట్లతో పోలిస్తే దాదాపు 738 శాతం పెరుగుదలతో రూ.942.09 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీలు), బ్లాక్ రిసోర్స్ సెంటర్లు(బీఆర్సీలు), కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీ--ఈపీలు) ద్వారా ఈ పథకం అత్యంత సమర్థవంతంగా అమలవుతోంది. కనీసం 60 శాతం మంది మహిళా ప్రతినిధులతో కూడిన ఈ యంత్రాంగం గ్రామీణ పారిశ్రామికవేత్తలకు వ్యాపార ప్రణాళికల తయారీ నుంచి రుణాల మంజూరు వరకు ప్రతి దశలోనూ సాయపడుతోంది.

**నమ్మకమైన ఫలితాలు.. నూతన వెలుగులు**

క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(క్యూసీఐ) నిర్వహించిన మధ్యంతర మదింపు ప్రకారం.. ఎస్వీఈపీ గ్రామీణ జీవనోపాధిపై ఊహించని రీతిలో సానుకూల ప్రభావం చూపింది. ఈ పథకం ద్వారా సహాయం పొందిన సంస్థల్లో ఏకంగా 99 శాతం సంస్థలు లాభాల బాటలో పయనిస్తుండగా, సగటున నెలకు రూ.39,000 ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. తయారీ రంగ సంస్థలైతే నెలకు గరిష్ఠంగా రూ.47,800 వరకు సంపాదిస్తున్నాయి. అంతేకాకుండా, కుటుంబాల మొత్తం ఆదాయంలో ఈ గ్రామీణ సంస్థల వాటా 57 శాతంగా నమోదు కావడం విశేషం. ఏకంగా 96 శాతం మంది పారిశ్రామికవేత్తలు తమ పొదుపు పెరిగిందని హర్షం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల్లో 75 శాతం మంది మహిళలే కావడం గ్రామీణ మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనం.





# వందేభారత్‌లో 'గుండె' తరలింపు

**సూరత్ నుంచి అహ్మదాబాద్‌కు.. దేశంలోనే తొలిసారి**

అహ్మదాబాద్: భారత రైల్వే చరిత్రలో ఒక అరుదైన, చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశంలోనే తొలిసారిగా, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో దాత నుంచి సేకరించిన గుండెను విజయవంతంగా తరలించారు. సూరత్ నుంచి అహ్మదాబాద్‌కు అతి తక్కువ కాలంలో అవయవాన్ని చేరవేసి, ఒక ప్రాణాన్ని నిలబెట్టడంలో రైల్వే శాఖ కీలక పాత్ర పోషించింది. సూరత్‌లో దాత నుంచి సేకరించిన గుండెను అహ్మదాబాద్‌లోని యూఎన్ మెహతా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగికి అమర్చాల్సి ఉంది. సమయం అత్యంత కీలకమైన ఈ ఆపరేషన్ కోసం, రైల్వే అధికారులు ముంబై సెంట్రల్ - గాంధీనగర్ క్యాపిటల్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (రైలు నెం. 20901) ద్వారా గుండెను తరలించాలని నిర్ణయించారు. ఈ బృహత్తర ప్రక్రియ కోసం భారత రైల్వే, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్), గుజరాత్ రాష్ట్ర పోలీసులు, వైద్య బృందాలు అత్యంత సమన్వయంతో పనిచేశాయి. రైలు అహ్మదాబాద్ స్టేషన్‌కు చేరుకోగానే, ప్లాట్‌ఫామ్ నెం.1 నుంచి యూఎన్ మెహతా ఆసుపత్రి వరకు ఆర్పీఎఫ్, గుజరాత్ పోలీసులు ప్రత్యేకంగా 'గ్రీన్ కారిడార్' ఏర్పాటు చేశారు. దీనివల్ల ఎలాంటి ఆటంకాలు లేకుండా గుండెను అత్యంత వేగంగా ఆసుపత్రికి చేర్చడం సాధ్యమైంది. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంపై అహ్మదాబాద్ డీఆర్ఎం వేద్ ప్రకాశ్ స్పందించారు. "ప్రాణాలను కాపాడే ఇటువంటి మిషన్లలో ప్రతి నిమిషం ఎంతో కీలకం. రైల్వే, ఆర్పీఎఫ్, పోలీసులు, వైద్య బృందాల మధ్య అద్భుతమైన సమన్వయం కారణంగానే ఇది సాధ్యమైంది. ఒక ప్రాణాన్ని కాపాడటంలో భాగస్వాములం కావడం మా బాధ్యత మాత్రమే కాకుండా, మానవతా దృక్పథంతో కూడిన మా కర్తవ్యం" అని ఆయన పేర్కొన్నారు.

# నిరాశలో పాక్ యువత

**ఏకమైతే వ్యవస్థ తలరాత మారుతుంది**

**పాకర్ మంత్రి మోహ్సిన్ నఖ్వీ**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మోహ్సిన్ నఖ్వీ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో నిరాశా నిస్పృహలతో ఉన్న యువతను 'బొద్దింకలు'గా అభివర్ణిస్తూ, వారంతా ఏకమైతే ప్రస్తుత వ్యవస్థను సమూలంగా కూల్చివేయగలరని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఇస్లామాబాద్‌లో నిర్వహించిన పాకిస్థాన్ ఎకనామిక్ సమ్మిట్‌లో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రస్తుత పాలనా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, దేశ సమస్యలను పరిష్కరించే సామర్థ్యం దానికి లేదని నఖ్వీ విశ్లేషించారు. "మీరు వారిని యువత అంటారో, బొద్దింకలు అంటారో అది మీ ఇష్టం.. కానీ ఆ బొద్దింకలే ఏకమైతే, వారు వ్యవస్థను పూర్తిగా మార్చివేయగలరు" అని ఆయన వ్యాఖ్యానించారు. తక్షణమే భారీ సంస్కరణలు చేపట్టకపోతే, మరో పదేళ్ల తర్వాత కూడా దేశం ఇవే సమస్యలపై చర్చించుకోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఉచిత పథకాలను ఆశించడం లేదని, వారికి కావాల్సింది న్యాయం, ప్రతిభ ఆధారిత అవకాశాలు మరియు ఉపాధి మాత్రమేనని స్పష్టం చేశారు. ఇందుకోసం కొత్త పరిపాలనా విభాగాలను ఏర్పాటు చేయడంతో పాటు, స్థానిక ప్రభుత్వాలకు మరిన్ని అధికారాలు కల్పించాలని ఆయన సూచించారు.

# వందేమాతరం తప్పనిసరి..

# మతస్వేచ్ఛపై దాడి: ముస్లిం లా బోర్డు

న్యూఢిల్లీ: 'వందేమాతరం' గీతాన్ని అగౌరవపరిస్తే శిక్షార్హమైన నేరంగా పరిగణించే సవరణ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడంపై ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చర్య పౌరుల మత స్వేచ్ఛను హరించడమేనని, దేశ రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. కేవలం ఏదో ఒక నినాదం లేదా గీతం ఆలపించడం ద్వారానే దేశభక్తిని అంచనా వేయలేమని బోర్డు శుక్రవారం స్పష్టం చేసింది. చట్టం ద్వారా ఒక నిర్దిష్ట మతపరమైన భావజాలాన్ని పౌరులందరిపై రుద్దడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని వాదించింది. బోర్డు అధికార ప్రతినిధి ఎస్‌క్యూఆర్ ఇలియాస్ మాట్లాడుతూ, "చట్టపరమైన ఒత్తిడితో అన్ని వర్గాల ప్రజలకు వందేమాతరం గీతాన్ని తప్పనిసరి చేయడం అభ్యంతరకరం. దేశాన్ని ప్రేమించడం, దేశాన్ని పూజించడం అనేవి రెండు భిన్నమైన అంశాలు" అని నొక్కి చెప్పారు. రాజ్యాంగంలోని అధికరణ 25 (మత స్వేచ్ఛ), అధికరణ 19 (భావ ప్రకటనా స్వేచ్ఛ) ప్రకారం ఏ పౌరుడినీ వారి మత విశ్వాసాలకు విరుద్ధంగా బలవంతం చేయలేరని ఆయన గుర్తుచేశారు. "ముస్లింలు తమ దేశాన్ని ఎంతో ప్రేమిస్తారు. మాతృభూమిపై మక్కువను తమ నైతిక బాధ్యతగా భావిస్తారు. అయితే, దేశాన్ని దేవతగా పరిగణించి పూజించడం వారి విశ్వాసాలకు విరుద్ధం" అని ఇలియాస్ స్పష్టం చేశారు. ఇటువంటి సున్నితమైన, విభజన చర్యలకు తావు ఇవ్వకుండా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పేదరికం, విద్య, వైద్యం వంటి మౌలిక సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని బోర్డు విజ్ఞప్తి చేసింది.

# మార్కెట్లకు

# మూడోరోజూ లాభాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. ఆటో, ఫైనాన్షియల్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో మార్కెట్లకు ఊతం లభించింది. మరోవైపు ఇటీవల భారీగా పెరిగిన ఐటీ షేర్లలో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఆ రంగంపై ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ 166.49 పాయింట్లు పెరిగి 78,094.64 వద్ద, నిఫ్టీ 66.45 పాయింట్లు ఎగిసి 24,383.60 వద్ద ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు నిఫ్టీలో అత్యధిక లాభాలు నమోదు చేశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 0.44 శాతం చొప్పున పెరిగాయి. ఆటో రంగంతో పాటు ఎఫ్ఎంసీజీ షేర్లు కూడా మంచి ప్రదర్శన కనబరిచాయి. అయితే ఐటీ సూచీ ఐదు రోజుల లాభాల పరంపరకు బ్రేక్ పడింది. ప్రస్తుతం నిఫ్టీకి 24,300 స్థాయి తక్షణ మద్దతుగా ఉంటుందని మార్కెట్ నిపుణులు తెలిపారు. ఆ స్థాయి కంటే దిగువకు వెళితే 24,200 వద్ద మరో కీలక మద్దతు ఉందన్నారు. త్రైమాసిక ఫలితాలు అంచనాల కంటే మెరుగ్గా వస్తుండటం మార్కెట్లకు బలాన్నిస్తోందన్నారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు తగ్గితే ఈ ర్యాలీ కొనసాగొచ్చని అభిప్రాయపడ్డారు.

# దొంగ నోట్ల గుర్తింపునకు సార్టింగ్ మెషీన్లు

**సరిహద్దు బ్యాంకులకు ఆర్బీఐ ఆదేశాలు**

న్యూఢిల్లీ: దేశంలో నకిలీ కరెన్సీ చలామణిని అరికట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. పొరుగు దేశాలతో సరిహద్దులు పంచుకుంటున్న జిల్లాల్లోని అన్ని బ్యాంకు శాఖల్లో నోట్ల ప్రామాణికతను పరిశీలించే (అథెంటికేషన్), వేరుచేసే (సార్టింగ్) యంత్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. నకిలీ నోట్లను గుర్తించడంలో కొన్ని బ్యాంకుల పనితీరు సంతృప్తికరంగా లేదని గమనించిన ఆర్బీఐ, ఈ మేరకు నూతన సర్క్యులర్‌ను విడుదల చేసింది. బ్యాంకులకు వచ్చే ప్రతి నోటు ప్రామాణికతను యంత్రాల ద్వారా విధిగా నిర్ధారించుకోవాలని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవేళ నకిలీ నోటును గుర్తిస్తే, దాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగదారుడికి తిరిగి ఇవ్వకూడదని లేదా బ్యాంకులోనే ధ్వంసం చేయకూడదని తేల్చిచెప్పింది. గుర్తించిన నకిలీ నోట్ల వివరాలను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత అధికారులకు నివేదించాలని సూచించింది. ఈ నిబంధనల అమలులో భాగంగా, బ్యాంకుల్లో నగదు లావాదేవీలు నిర్వహించే ప్రతి ఉద్యోగికి అసలు నోట్ల భద్రతా ఫీచర్లపై సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆర్బీఐ ఆదేశించింది. ఈ శిక్షణ ప్రక్రియను 2026 అక్టోబర్ 31 నాటికి పూర్తి చేయాలని గడువు విధించింది. నకిలీ నోట్లపై నిఘా ఉంచేందుకు ఏర్పాటు చేసిన 'ఫోర్జ్డ్ నోట్ విజిలెన్స్' (ఎఫ్ఎన్వీ) సెల్స్ ద్వారా డేటాను విశ్లేషించి, నకిలీ కరెన్సీ ఎక్కువగా చలామణి అవుతున్న ప్రాంతాలను (హాట్‌స్పాట్‌లు) గుర్తించాలని పేర్కొంది.

# కొత్త రకం డీజిల్ వచ్చేసింది!

**ఆవిష్కరించిన ఆర్మీ చీఫ్ ధీరజ్ సేత్**

**రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ ఘనత**

న్యూఢిల్లీ: భారత సైన్యం సరిహద్దుల్లో తన సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకునే దిశగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అత్యంత శీతల, మంచు ప్రాంతాల్లో సైనిక వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'ఎక్స్‌ట్రీమ్ వెదర్ గ్రేడ్' డీజిల్‌ను (ఎక్స్‌డబ్ల్యూజీ) ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేత్ శుక్రవారం ఢిల్లీలో ప్రారంభించారు. సాధారణంగా డీజిల్ అత్యంత తక్కువ ఉష్ణోగ్రతల వద్ద గడ్డకట్టి వాహనాల ఫిల్టర్లను మూసివేస్తుంది. అయితే, ఈ నూతన ఎక్స్‌డబ్ల్యూజీ డీజిల్ మైనస్ 42 డిగ్రీల సెల్సియస్ వద్ద కూడా సమర్థంగా పనిచేస్తుంది. బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఇంధనాన్ని, ప్రస్తుత సైనిక వాహనాల్లో ఎటువంటి సాంకేతిక మార్పులు చేయకుండానే నేరుగా వినియోగించవచ్చు. భారత సైన్యం, ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సమన్వయంతో కేవలం ఏడాది వ్యవధిలోనే దీనిని అభివృద్ధి చేయడం గమనార్హం. ఈ ఆవిష్కరణను ఆర్మీ చీఫ్ 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. ఇది సైనిక వాహనాల కదలికలను సులభతరం చేయడమే కాకుండా, సన్నద్ధతను మరియు కార్యాచరణ విశ్వసనీయతను గణనీయంగా పెంచుతుందని పేర్కొన్నారు. శీతాకాలంలో వాహనాలను స్టార్ట్ చేసేందుకు గతంలో అనుసరించిన ప్రమాదకర పద్ధతులకు ఇది స్వస్తి పలుకుతుందని, తద్వారా సైనిక సిబ్బంది భద్రతతో పాటు మనోధైర్యం పెరుగుతుందని ఆయన వివరించారు.

# కర్ణాటకకు రావొద్దు

**విజయ్‌కు డీకే శివకుమార్ సూచన**

బెంగళూరు: కావేరి వివాదం నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బెంగళూరు పర్యటనను వాయిదా వేసుకోవాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సూచించా రు. ఆగస్టు 3న మంత్రులతో కలిసి బెంగళూరుకు వస్తానని విజయ్ తెలిపారని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యటన సరైనది కాదని తాను వివరించినట్లు చెప్పారు. విధానసౌధలో ఉప ముఖ్యమంత్రి జి.పరమేశ్వర, జలవనరుల శాఖ మంత్రి రామలింగారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడిన శివకుమార్.. అతిథులు వచ్చినప్పుడు ఆహ్వానించడం తమ బాధ్యతని అన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా నిరసనలు చేపట్టినా, నినాదాలు చేసినా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. అందుకే కొంతకాలం ఓపిక పట్టాలని విజయ్‌ను కోరినట్లు వెల్లడించారు. ఆదివారం జరగనున్న అఖిలపక్ష సమావేశం తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని శివకుమార్ తెలిపారు. ప్రస్తుతం కర్ణాటకలో వర్షాలు కురుస్తుండటంతో జలాశయాల్లోకి నీటి ప్రవాహం పెరుగుతోందని, దీంతో చర్చలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొత్త తేదీ ఖరారు చేస్తామని చెప్పారు. మేకెదాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు కర్ణాటకతో పాటు తమిళనాడుకూ ప్రయోజనం చేకూరుస్తుందని శివకుమార్ అన్నారు. ఈ ప్రాజెక్టు తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి కోసమేనని, సాగునీటి అవసరాలకు కాదని స్పష్టం చేశారు. కావేరి జలాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తామని, అయితే వర్షాభావం, నీటి లభ్యత వంటి ప్రస్తుత పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.





**కర్ణాటకలో జననాయగన్‌కు నిరసనల సెగ**


కావేరీ జలాల వివాదం తమిళ అగ్ర కథనాయకుడు, ముఖ్యమంత్రి విజయ్ నటించిన 'జన నాయగన్' చిత్ర ప్రదర్శనలు కర్ణాటక వ్యాప్తంగా నిలిచిపోయాయి. తమిళనాడుకు కావేరి జలాలను విడుదల చేయడాన్ని నిరసిస్తూ కన్నడ అనుకూల సంఘాలు, రైతులు ఆందోళనలు చేపడుతుండటంతో, శాంతిభద్రతల దృష్ట్యా థియేటర్ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా షోలను రద్దు చేశాయి. జూలై 23న విడుదలైన ఈ చిత్రం కర్ణాటకలో సుమారు 125 నుంచి 150 థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. అయితే, తాజా నిరసనల నేపథ్యంలో పలు థియేటర్ల వద్ద విజయ్ పోస్టర్లు, బ్యానర్లను నిరసనకారులు తొలగించారు. బెంగళూరులోని ప్రముఖ ఊర్వశి థియేటర్‌లో పోలీసుల సూచన మేరకు ప్రదర్శనలు నిలిపివేసి, విజయ్ సినిమా స్థానంలో 'కరవళి' అనే కన్నడ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా థియేటర్ వద్ద పోలీసు బలగాలను మోహరించారు. మండ్యలో కన్నడ కార్యకర్తలు సినిమా ప్రమోషనల్ బ్యానర్లను చించివేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# స్పెయిన్‌కు వలసల వెల్లువ

**ఒక్కరోజులో 49 వేల మంది రాక**

**స్పెయిన్ సుప్రీంకోర్టు తీర్పుతో ఆగమాగం**

**సముద్ర మార్గంలో 18 మంది మృతి**



స్యూటా: ఒక చిన్న భూభాగం.. కానీ ప్రపంచ రాజకీయాల్లో పెద్ద చర్చ. వేలాది మంది ప్రాణాలను పణంగా పెట్టి అక్కడికి చేరేందుకు సముద్రంలో దూకుతున్నారు. కొందరు అలలను దాటుకుని గమ్యానికి చేరుతుంటే.. మరికొందరు అదే సముద్రంలో ప్రాణాలు కోల్పోతున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో స్పెయిన్ సైన్యాన్ని రంగంలోకి దించాల్సి వచ్చింది. గత 24 గంటల్లోనే 49 వేల మందికిపైగా స్యూటాలోకి ప్రవేశించినట్లు స్పెయిన్ ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఉత్తర ఆఫ్రికాలోని మొరాకో తీరానికి ఆనుకుని ఉన్న స్పెయిన్‌కు చెందిన చిన్న స్వయం ప్రతిపత్తి ప్రాంతమే స్యూటా. భౌగోళికంగా ఆఫ్రికాలో ఉన్నా.. రాజకీయంగా స్పెయిన్‌లో భాగం. అందువల్ల ఇది యూరోపియన్ యూనియన్ భూభాగమే. యూరప్‌లోకి వెళ్లాలనుకునే వలసదారులకు ఇది అత్యంత దగ్గరి మార్గం. ఈసారి పరిస్థితి గతంతో పోలిస్తే మరింత తీవ్రంగా మారింది. ఒక్క రోజులోనే 49 వేల మందికిపైగా స్యూటాలోకి ప్రవేశించినట్లు స్పెయిన్ తెలిపింది. శరణార్థుల కేంద్రాలు నిండిపోయాయి. స్థానిక పోలీసులు పరిస్థితిని అదుపు చేయలేని స్థితి ఏర్పడింది. దీంతో సైన్యం, నౌకాదళం, వైమానిక దళాన్ని రంగంలోకి దించి సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేశారు. స్యూటాకు చేరే మార్గం అత్యంత ప్రమాదకరం. మొరాకో తీరం నుంచి సముద్రంలో ఈదుకుంటూ సరిహద్దు దాటాల్సి వస్తుంది. బలమైన అలలు, సముద్ర ప్రవాహాలు, సరిహద్దు అడ్డంకులు ఈ ప్రయాణాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తాయి. ఈసారి కూడా కనీసం 18 మంది మృతి చెందారు. ఎక్కువ మంది మునిగిపోయారు. మరెందరో నీటిలో చిక్కుకోగా సహాయక బృందాలు కాపాడాయి.

# 19 ఏళ్ల తర్వాత కోల్‌కతాలో తస్లీమా

కోల్‌కతా: దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత వివాదాస్పద బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ మళ్లీ కోల్‌కతాలో అడుగుపెట్టారు. 2007లో తన 'ద్విఖండితో' ఆత్మకథపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో నగరాన్ని విడిచి వెళ్లాల్సి వచ్చిన ఆమె, నేడు కోల్‌కతాలోని నేతాజీ సుభాశ్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ "ఇక్కడ నాకు చాలా సంతోషంగా ఉంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ఒకప్పుడు బంగ్లాదేశ్ నుంచి పారిపోయి వచ్చి కోల్‌కతానే తన నివాసంగా మార్చుకున్న తస్లీమాను, ఇక్కడి నుంచి వెళ్లగొట్టిన వివాదం తెలిసిందే. ఆమె రాసిన 'ద్విఖండితో' పుస్తకం మతపరమైన మనోభావాలను దెబ్బతీస్తోందనే ఆరోపణలతో అప్పటి సీపీఎం ప్రభుత్వం 2003లో నిషేధించింది. ఆ తర్వాత 2007లో తీవ్ర నిరసనల కారణంగా ఆమె నగరాన్ని వీడారు. ప్రస్తుతం 63 ఏళ్ల తస్లీమా ఢిల్లీలో దీర్ఘకాలిక నివాస అనుమతితో ఉంటున్నారు. రేపు ఆమె రవీంద్ర సదన్‌లో మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, ప్రముఖ రచయిత శిర్షెందు ముఖోపాధ్యాయ కూడా హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఆమె తన కవితలను వినిపించడంతో పాటు ఒక చర్చా కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. తన రాకపై పీటీఐతో మాట్లాడుతూ.. "నేను కోల్‌కతాను ఎప్పుడూ ఇష్టపూర్వకంగా విడిచిపెట్టలేదు. అప్పటి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నన్ను బలవంతంగా రాష్ట్రం విడిచి వెళ్లేలా చేసింది. అయినా ఏదో ఒక రోజు తిరిగి వస్తానని ఆశతోనే ఉన్నాను. ఏళ్లు గడిచాయి, ప్రభుత్వాలు మారాయి, అయినా నాకు తలుపులు మూసే ఉన్నాయి" అని ఆమె తన ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇకపై యూపీఐతో పీఎఫ్ క్లెయిమ్స్

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన సేవలను ఆధునికీకరించే దిశగా మరో కీలక అడుగు వేస్తోంది. పీఎఫ్ క్లెయిమ్స్‌లను 'భీమ్' యాప్ ద్వారా పరిష్కరించేలా నూతన విధానాన్ని ప్రవేశపెడుతోంది. ఈ సౌకర్యం నెల రోజుల్లోనే అందుబాటులోకి వస్తుందని సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రమేష్ కృష్ణమూర్తి శుక్రవారం వెల్లడించారు. ఈ నూతన విధానం ద్వారా ఈపీఎఫ్ఓ సభ్యులు తమ క్లెయిమ్ లను భీమ్ యాప్ ద్వారా సమర్పించవచ్చని, సెటిల్ అయిన మొత్తం నేరుగా వారి యూపీఐ అనుసంధిత బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని ఆయన వివరించారు. దీనివల్ల క్లెయిమ్స్ ప్రక్రియ మరింత వేగంగా, సులభతరంగా మారుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు, యాజమాన్యాలకు మెరుగైన సేవలను అందించే లక్ష్యంతో ఈపీఎఫ్ఓ ఈ సంస్కరణలు చేపట్టింది. క్లెయిమ్ పరిష్కారంలో గతంలో ఉన్న జాప్యాన్ని ఇప్పటికే అధిగమించామని, ఆటో-సెటిల్‌మెంట్ రేట్లు 90 శాతానికి చేరిందని కృష్ణమూర్తి తెలిపారు.

భవిష్యత్తులో వచ్చే క్లెయిమ్స్‌లను వీలైనంత వరకు అదే రోజు లేదా గరిష్ఠంగా రెండు రోజుల్లోపు పరిష్కరించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం త్వరలో ప్రత్యేక పథకాన్ని ప్రకటించనుందని కృష్ణమూర్తి వెల్లడించారు. ఈ బాధ్యతను ఈపీఎఫ్ఓ లేదా మరో ఏజెన్సీకి అప్పగించే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో యాజమాన్యాలకు నిబంధనల అమలును మరింత సరళతరం చేస్తామని, సామాజిక భద్రత కల్పనలో ఈపీఎఫ్ఓపై ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

వయ్యారి చిత్రం







## 80 రోజుల షూటింగ్..
# 250 రోజుల్లో రిలీజ్

సూపర్‌స్టార్ మహేశ్ బాబు – రాజమౌళి వారణాసి సినిమా విడుదలపై కొత్త కొత్త ప్రచారాలు తెరపైకి వస్తున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న సినిమా థియేటర్లో విడుదలవుతుందని మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. అయితే అనుకున్న సమయానికి సినిమా రాదని, వాయిదా పడుతుందని సోషల్ మీడియాలో వందతులు వచ్చాయి. వీటన్నింటికీ వారణాసి మూవీటీమ్ చెక్ పెడుతూ శుక్రవారం ఓ పోస్టు షేర్ చేసింది. దీంతో మహేశ్ ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం వచ్చింది. ముందుగా చెప్పిన ప్రకారమే సినిమా ఏప్రిల్ 7న విడుదల ఉంటుందని స్పష్టం చేస్తూ వారణాసి టీమ్ ఇవాళ కౌంట్‌డౌన్ షురూ చేసింది. ఈ చిత్రం విడుదలకు శుక్రవారం నుంచి సరిగ్గా 250 రోజులు ఉందని సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేసింది. 'వారణాసి రిలీజ్‌కు ఇంకా 250 రోజులు. 2027 ఏప్రిల్ 7' అని పోస్టు చేసింది. కాగా, ఈ సినిమాకు సంబంధించిన 80 రోజుల షూటింగ్ మాత్రమే మిగిలివుంది. మేజర్ ఐమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌కి సంబంధించిన షూటింగ్ ఇటీవలే పూర్తయింది. హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఈ సన్నివేశాలను రాజమౌళి తెరకెక్కిస్తున్నారు.

## కార్తీ 'సర్దార్ 2' టీజర్..
# నెక్ట్స్ లెవెల్!

కోలీవుడ్ హీరో కార్తీ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' (2022) చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'సర్దార్ 2' టీజర్ విడుదలైంది. యాక్షన్ ప్రియులను ఉర్రూతలూగించేలా ఉన్న ఈ టీజర్‌తో పాటు, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. టీజర్‌ను బట్టి చూస్తే, ఈసారి అంతర్జాతీయ కుట్రలను ఛేదించే సీక్రెట్ ఏజెంట్‌గా కార్తీ మరింత పవర్‌ఫుల్ పాత్రలో




కనిపించనున్నారు. మొదటి భాగంలో లాగే ఇందులో కూడా తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. హాలీవుడ్ చిత్రాలను తలపించేలా హై–స్పీడ్ ఛేజ్ సీక్వెన్సులు, భారీ యాక్షన్ బ్లాక్స్‌తో టీజర్‌ను తీర్చిదిద్దారు. దీంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. 'సర్దార్' మొదటి భాగానికి దర్శకత్వం వహించిన పీఎస్ మిత్రన్ ఈ సీక్వెల్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. కార్తీ సరసన మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, రాశీ ఖన్నా, రాజీషా విజయన్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన శామ్ సీఎస్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ విడుదల తర్వాత 'సర్దార్' మొదటి భాగాన్ని మించి ఈ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# రెండో పెళ్లి ఆలోచన లేదు: సురేఖావాణి

టాలీవుడ్ నటి సురేఖావాణి ఒకప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఎంతోమంది స్టార్ హీరోలతో నటించి ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. అయినప్పటికీ గత కొద్ది కాలంగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె తమిళ చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ప్రస్తుతం సురేఖావాణి నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'నిరమ్'. దర్శకుడు కృష్ణ బలరామ్ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో తాన్యా హోప్, ప్రీతి అస్రాని, సురేష్ చక్రవర్తి, శ్రీజిత్ రవి, తిరునావుక్కరసు గజరాజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. కెస్క్వేర్ సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు ఇమ్మాన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో సురేఖావాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లు, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆమె క్లారిటీ ఇచ్చారు. రెండో పెళ్లి గురించి అడగ్గా.. తనకు ఎలాంటి రెండో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని, ఒకవేళ ఆ ఆలోచనే ఉంటే ఇప్పటివరకు ఆగాల్సిన అవసరం ఉండేది కాదని సురేఖావాణి స్పష్టం చేశారు.





## క్యాన్సర్ రోగులకు
# వివేక్ ఒబెరాయ్ భారీ విరాళం

బాలీవుడ్ నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'రామాయణ'. ఈ ప్రిస్టీజియస్ ప్రాజెక్టును అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తుండగా.. ఇందులోని పాత్రలకు సైతం భారీ రెమ్యునరేషన్ అందుతున్నట్లు తెలుస్తుంది. అలాంటి భారీ మొత్తంలో వచ్చే రెమ్యునరేషన్ సైతం తనకు వద్దు అని చెప్పాడట బాలీవుడ్ నటుడు వివేక్ ఒబరాయ్. 'రామాయణ'లో వివేక్ ఒబరాయ్ విభీషణుడి పాత్రలో నటిస్తున్నాడు. అయితే.. ఈ సినిమా కోసం తీసుకోవాల్సిన రెమ్యూనరేషన్‌ను పూర్తిగా క్యాన్సర్‌తో పోరాడుతున్న పిల్లల ట్రీట్‌మెంట్ కోసం విరాళంగా ఇవ్వాలని ఫిక్స్ అయ్యాడట. అంతే కాకుండా ఈ విషయాన్ని నిర్మాత నమిత్ మల్హోత్రాకు ముందుగానే తెలిపినట్లు వివేక్ వెల్లడించారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ వైరల్ కావడంతో నెట్టింట ప్రశంసలు కురిపిస్తున్నారు నెటిజన్లు. అలాగే.. రామాయణంలో విభీషణుడు కేవలం రావణుడి సోదరుడు మాత్రమే కాకుండా, అధర్మం ముందు మౌనంగా నిలబడకుండా ధర్మాన్ని ఎంచుకున్న వ్యక్తి.



ముగెన్ రావ్, ప్రీతి అస్రాని, తాన్యా హోప్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'నిరమ్'. ఈ చిత్రాన్ని కె. స్క్వేర్ సినిమాస్ సమర్పణలో యూనిట్ ఆఫ్ కె స్క్వేర్ వెంచర్స్ బ్యానర్‌పై కె. బిందుమాధవి నిర్మిస్తున్నారు. సరికొత్త ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ దర్శకుడు బలరామ్ కృష్ణ రూపొందిస్తున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా తాజాగా 'నిరమ్' సినిమా తెలుగు ట్రైలర్, ఆడియో లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ తాన్యా హోప్ మాట్లాడుతూ.. 'మా నిరమ్ మూవీ టీమ్‌తో కలిసి మీ ముందుకు రావడం సంతోషంగా ఉంది. మా సినిమా త్వరలోనే రిలీజ్‌కు రెడీ అవుతోంది. మీరంతా మా సినిమా చూసి ఎంజాయ్ చేయండి. నా క్యారెక్టర్ చాలా సింపుల్‌గా ఉంటుంది. ఒక సాధారణ యువతి తనకు తెలియకుండా ఒక పెద్ద సమస్యలో చిక్కుకుపోతే ఎలా ఇబ్బంది పడుతుంది, ఆ సమస్య నుంచి ఎలా బయటపడుతుంది అనేది నా పాత్రలో చూస్తారు. ఇంట్రెస్టింగ్‌గా వెళ్లే కథలో నేనూ ఒక భాగంగా కనిపిస్తా. ఈ టీమ్‌తో వర్క్ చేయడం హ్యాపీగా అనిపించింది.

# నా క్యారెక్టర్ ఇంట్రెస్టింగ్



# స్పోర్ట్స్ డ్రామాతో నందమూరి తేజస్విని ఎంట్రీ?

నటుడు, టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని త్వరలోనే వెండితెరకు పరిచయం కాబోతున్నారా? అంటే అవునన్న వార్త సోషల్ మీడియాలో, ఫిల్మ్‌నగర్ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అయితే, సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, ఒక ప్రయోగాత్మకమైన, యువతకు స్ఫూర్తినిచ్చే స్పోర్ట్స్ డ్రామా ద్వారా ఆమె ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కథా చర్చలు శరవేగంగా జరుగుతున్నాయని, అన్ని అంశాలు కుదిరితే త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే 'అన్‌స్టాపబుల్' టాక్ షోకు క్రియేటివ్ హెడ్‌గా, పలు సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించిన తేజస్విని... ఇప్పుడు నేరుగా నటిగా మారనున్నారనే వార్తలతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# షూటింగ్‌లో రష్మిక గాయాలు.. 6 వారాల రెస్ట్

సినీ నటి రష్మిక మందన్నకు గాయలయ్యాయి. సినిమా షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు వైద్యులు గుర్తించారు. ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. ప్రస్తుతం ఆమె రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'లో నటిస్తున్నారు. కథానాయిక ప్రాధాన్యమున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపిస్తున్నారు. యదార్ధ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న 'మైసా'కు సంబంధించి కీలక యాక్షన్ సన్నివేశాలతో పాటు, అండర్ వాటర్ సీక్వెన్స్‌ను ఇటీవల పూర్తి చేశారు. తాజాగా ఈ సినిమాలోని ఓ పాటను షూట్ చేస్తుండగా ప్రమాదం జరిగింది.







# డబుల్ గోల్డ్




## జూడోలో భారత్‌కు రెండు స్వర్ణాలు

### అస్మిత, హర్ష్‌లకు బంగారు పతకాలు

**కామన్వెల్త్ క్రీడలు 2026లో భారత జూడోకాలు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. జూడోలో భారత్‌కు గోల్డెన్ డబుల్ అందించి దేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించారు. మహిళల 48 కేజీల విభాగంలో అస్మితా దే, పురుషుల 60 కేజీల విభాగంలో హర్ష్ సింగ్ స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని పోడియంపై నిలిచారు.**

**గంట వ్యవధిలో ఒకరి తర్వాత ఒకరు సాధించిన ఈ విజయాలతో గ్లాస్గోలో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. మహిళల 48 కేజీల విభాగంలో గురువారం జరిగిన ఫైనల్స్‌లో అస్మితా దే అద్వితీయమైన పోరాట పటిమను ప్రదర్శించింది. కెనడాకు చెందిన అనుభవజ్ఞురాలైన హీదీ క్వాచ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో అస్మిత 2-1 తేడాతో విజయం సాధించింది.**

ఆద్యంతం వ్యూహాత్మకంగా ఆడిన అస్మిత, కీలక సమయాల్లో సంయమనం పాటిస్తూ పాయింట్లు సాధించి కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. టోర్నమెంట్ మొదటి నుంచి నిలకడైన ప్రదర్శనతో ఫైనల్ చేరిన ఆమె, తుది పోరులోనూ అదే జోరును కొనసాగించి బంగారు పతకాన్ని ముద్దాడింది. అస్మిత స్ఫూర్తితో బరిలోకి దిగిన భారత యువ జూడోకా హర్ష్ సింగ్ కూడా సత్తా చాటాడు. పురుషుల 60 కేజీల విభాగంలో జరిగిన ఫైనల్‌లో అతను పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఆస్ట్రేలియాకు చెందిన జోషువా కాట్జ్‌తో జరిగిన టైటిల్ పోరును ఏకపక్షంగా మార్చేశాడు. ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా సాధించే అవకా శం ఇవ్వకుండా, 10-0 తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. హర్ష్ వేగం, కచ్చితమైన ఎత్తుగడల ముందు ఆస్ట్రేలియా జూడోకా నిలవలేకపోయాడు. ఈ రెండు స్వర్ణాలతో కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం పతకాల సంఖ్య 19కి చేరింది. ఇందులో 5 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్య పతకాలు ఉ న్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే పలు టోర్నీలలో సత్తా చాటిన హర్ష్ సింగ్, అస్మితా దేల విజయాలు దేశంలో జూడో క్రీడకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విజయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




## వైభవ్‌కు వైస్ కెప్టెన్సీ అవసరమా?: హర్ష భోగ్లే

వైభవ్ సూర్యవంశీ వైస్ కెప్టెనా? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు ప్రముఖ క్రికెట్ కామెంటేటర్ హర్ష భోగ్లే. సీనియర్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తక్కువ అనుభవం ఉన్న జూనియర్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం సబబేనా!. దీనికి కారణం తెలియడం లేదని, ఈ ఆలోచన సరైనది కాదని సెలెక్టర్ల నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. 12 ఇన్నింగ్స్‌లలో 17.2 సగటుతో 207 పరుగులు చేసిన సూర్యవంశీకి ఈ బాధ్యతలు ఇవ్వడం సరికాదని అన్నారు. అతి ప్రతి అసాధారణమైనదే, కానీ అతడు నేర్చుకోవాల్సింది ఇంకా ఉందని, ఇలాంటి బాధ్యతలకు ప్రస్తుతానికి అర్హుడు కాదని వెల్లడించారు. దులీప్ ట్రోఫీ 2026-27 సీజన్‌కు ఈస్ట్ జోన్ టీమ్‌ను ప్రకటించారు. దీనికి ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా, చిచ్చర పిడుగు, బుడ్డోడు అయిన సూర్యవంశీ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. దీంతో సూర్యవంశీ వైస్ కెప్టెన్సీపై చాలామంది తమకు నచ్చినట్లు స్పందిస్తున్నారు. హర్ష భోగ్లే కూడా పై విధంగా తన 'ఎక్స్ ఖాతాలో స్పందించారు.




## ఫిట్‌నెస్ పరీక్షలో బుమ్రా పాస్

శ్రీలంక పర్యటనకు ముందే భారత జట్టుకు గుడ్‌న్యూస్. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చేస్తున్నాడు. గాయం నుంచి కోలుకున్న ఈ యార్కర్ కింగ్ ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యాడు. దాంతో, త్వరలో లంకతో జరుగబోయే రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉ ంటాడని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. పొరుగుదేశమైన లంకకు శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా ఆగస్టులో వెళ్లనుంది. పని ఒత్తిడి కారణంగా తరచూ గాయపడుతున్న జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ టెస్టులో పాసయ్యాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ సమయంలో గాయపడిన బుమ్రా.. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకున్నాడు. ఫిట్‌నెస్ పరీక్షలో పాసైన అతడు శ్రీలంక పర్యటనకు సిద్ధమవుతున్నాడని సమాచారం. దాంతో, ఇప్పటికే స్క్వాడ్‌కి ఎంపికైన బుమ్రా సిరీస్‌లో ఆడడం దాదాపు ఖరారైన నేపథ్యంలో భారత జట్టుకు పేస్ బౌలింగ్ కష్టాలకు తెరపడనుంది. ఆగస్టులో శుభ్‌మన్ సారథ్యంలోని భారత జట్టు లంకు వెళ్లనుంది. అక్కడ ఆగస్టు 15 వ తేదీన గాలే స్టేడియంలో మొదటి టెస్టు.. ఆపై ఆగస్టు 23న కొలంబోలో రెండో టెస్టులో ఇరుజట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో ఉన్న గిల్ సేన.. ఈ రెండు మ్యాచుల్లో గెలిచినా టాప్-2లోకి వచ్చే అవకాశాలు తక్కువే.

## చీఫ్ సెలెక్టర్ రేసులో అశ్విన్?

వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కంటే ముందు చీఫ్ సెలెక్టర్‌గా సేవలందిస్తున్న అజిత్ అగార్కర్ పదవీకాలం ముగియనుంది. సెప్టెంబర్‌తో అగార్కర్ కాలపరిమితి పూర్తి కానున్నందున తదుపరి ప్రధాన సెలెక్టర్ ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు చాలామందే ఉన్నప్పటికీ మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ రేసులో అందరికంటే ముందున్నాడనే కథనాలు వస్తున్నాయి. బీసీసీఐ కూడా అగార్కర్ స్థానంలో మాజీ ఆఫ్ స్పిన్నరైన యశ్‌కు బాధ్యతలు అప్పగించనుందనే వార్తలు నెట్టింట వైరలవుతున్నాయి. సీనియర్లను పక్కన పెట్టేసి.. కుర్రాళ్లకు పెద్దపీట వేయడంతో పాటు స్క్వాడ్ ఎంపిక కూడా అస్సలు బాగుండడం లేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ గడ్డపై టీ20 సిరీస్ ఓటమితో హెడ్‌కోచ్ గౌతం గంభీర్, ప్రధాన సెలెక్టర్ అగార్కర్ పనితీరపై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో, పదవీకాలం ముగింపు దశలో ఉన్న గవార్కర్‌ను పొడిగిస్తారా? లేదా? అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. అప్పుడే అగార్కర్ వారసుడు ఎవరు? అనే చర్చ మొదలైంది. ఎందుకంటే.. మరో నెల రోజుల్లో(సెప్టెంబర్) చీఫ్ సెలెక్టర్‌గా అగార్కర్ పదవీకాలం ముగియనుంది. దాంతో, కాబోయే ప్రధాన సెలెక్టర్ ఎవరు? పోటీలో ఎవరెవరు ఉన్నారు? అనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అగార్కర్ అనంతరం మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ ప్రధాన సెలెక్టర్ పదవిని చేపట్టే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే వన్డే ప్రపంచకప్ 2027 ముందే అశ్విన్ నియామకం జరుగుతుందని ఆన్‌లైన్‌లో కథనాలు వస్తున్నాయి. దాంతో.. ఒక్కసారిగా అశ్విన్ ఎక్స్‌లో ట్రెండ్ అవుతున్నాడు. రిటైర్మెంట్ అనంతరం సొంత యూట్యూబ్ ఛానెల్లో క్రికెట్ విశ్లేషణలు చేస్తున్న స్పిన్ దిగ్గజం మాత్రం ఈ వైరల్ వార్తలపై స్పందించలేదు. బీసీసీఐ సైతం అగార్కర్ మార్పుపై ఎలాంటి ప్రకటన ఇంకా చేయలేదు.







## కోల్‌కతాకు బ్రెజిల్ టీం

ఊహించినట్టుగానే బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టు భారత పర్యటన ఖరారైంది. ఆ దేశ సీనియర్ టీమ్ మొట్టమొదటిసారి ఇండియాకు రానుంది. ఫుట్‌బాల్‌ను అమితంగా ఇష్టపడే కోల్‌కతావాసులను అలరించేందుకు సాల్ట్ లేక్ స్టేడియంలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనుంది బ్రెజిల్ జట్టు. అక్టోబర్‌లో బ్లూ టైగర్స్‌తో ఈ మ్యాచ్ విషయాన్ని శుక్రవారం బ్రెజిలియన్ ఫుట్‌బాల్ సమాఖ్య అధికారికంగా వెల్లడించింది. ఫిఫా వరల్డ్‌కప్ జోష్ ముగిసినా.. భారత్‌లో మళ్లీ ఫుట్‌బాల్ సందడి మొదలవ్వనుంది. మేటి జట్లలో ఒకటైన బ్రెజిల్ అక్టోబర్‌లో ఇండియాకు వస్తోంది. భారత జట్టుతో మ్యాచ్ కోసం ఆ దేశ సీనియర్ జట్టు రావడం ఖరారైందని బ్రెజిలియన్ ఫుట్‌బాల్ సమాఖ్య వెల్లడించింది. ఫుట్‌బాల్ అంటే పడిచచ్చే జనమున్న కోల్‌కతాలో అక్టోబర్ 3వ తేదీన బ్లూ టైగర్స్‌ను బ్రెజిల్ ఢీకొట్టనుంది. 'ది గోట్ ఇండియా టూర్' పర్యటనలో లియోనల్ మెస్సీ బృందం అభిమానులతో మమేకమైన సాల్ట్ లేక్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగనుంది.

## నిస్వార్థ ఆటగాడు రహానే: సచిన్



అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన అజింక్య రహానెపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల జల్లు కురిపించారు. జెర్సీ నంబర్ 278కి వీడ్కోలు పలుకుతూ రహానె సోషల్ మీడియా వేదికగా రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో సచిన్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "మనం తొలిసారి ముంబయి జట్టు తరఫున కలిసి బ్యాటింగ్ చేసినప్పుడే... అవకాశాల కోసం ఎన్నడూ వెంటపడని ఒక ప్రత్యేకమైన ఆటగాడిని నీలో చూశాను. జట్టు విజయం కోసం కష్టపడేందుకు నువ్వు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవాడివి, అందుకే అవకాశాలే నిన్ను వెతుక్కుంటూ వచ్చేవి. నీకున్న ఆ గొప్ప లక్షణమే ఆస్ట్రేలియా గడ్డపై నీ కెరీర్‌లోనే మరచిపోలేని అత్యుత్తమ విజయ క్షణాలను అందించింది. సంయమనంతో ఆడటం అనేది దూకుడుకు ఎప్పుడూ అడ్డుకాదని నువ్వు నిరూపించావు. వండర్‌ఫుల్ కెరీర్ రహానె, కంగ్రాచులేషన్స్!" అని సచిన్ కొనియాడారు. రహానె సుదీర్ఘ అంతర్జాతీయ ప్రయాణానికి ముగింపు పలకడంతో, భారత మాజీ, ప్రస్తుత క్రికెటర్లు కూడా సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ టీమిండియాకు ఆయన అందించిన అద్భుత సేవలను గుర్తుచేసుకుంటున్నారు.

## 2027 ప్రపంచకప్‌కు భువీని తీసుకోవాలి

టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్‌కు అనుభవజ్ఞుడైన పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను ఎంపిక చేయాలని సూచించాడు. దక్షిణాఫ్రికా పరిస్థితుల్లో భువనేశ్వర్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించగలడని అభిప్రాయపడ్డాడు. అతణ్ని ఇప్పటి నుంచే దేశవాళీ టోర్నీల్లో ఆడిస్తూ ప్రపంచకప్‌కు సిద్ధం చేయాలని బీసీసీఐకి సూచించాడు. 2026 ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఛాంపియన్‌గా నిలపడంలో భువనేశ్వర్ కీలక పాత్ర పోషించాడు. 28 వికెట్లు తీసి తన సత్తా చాటాడు. అయితే అతడు చివరిసారిగా 2022లోనే భారత్ తరఫున వన్డే ఆడాడు. అయినా అతడి అనుభవం జట్టుకు ఎంతో ఉ పయోగపడుతుందని అశ్విన్ పేర్కొన్నాడు. శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టుపైనా అశ్విన్ స్పందించాడు. గాలే పిచ్‌ను దృష్టిలో పెట్టుకుని ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో బరిలోకి దిగాలని సూచించాడు. రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు ఇవ్వాలని చెప్పాడు. ఏడో స్థానంలో సారాంశ్ జైన్‌ను ఆడిస్తే జట్టు సమతుల్యంగా అభిప్రాయపడ్డాడు. యువ బ్యాటర్ సాయి సుదర్శన్ ఫిట్‌నెస్‌పైనా అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల ఇండియా-ఏ తరఫున గాలేలో సెంచరీ చేయడం అతడికి పెద్ద ప్లస్ అవుతుందని తెలిపాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 1-8-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

## తప్పు కాలేజీలదా? ప్రభుత్వానిదా?

'నాలుగేళ్లు చదివాడు.. లక్షలు ఖర్చు పెట్టాడు.. చేతిలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉంది. కానీ ఉద్యోగం లేదు..' ఇది ఒకరి కథ కాదు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థుల వాస్తవ పరిస్థితి. ఒకప్పుడు ఇంజనీరింగ్ డిగ్రీ అంటే ఉద్యోగానికి గ్యారంటీ అనే భావన ఉండేది. నేడు అదే డిగ్రీ అనేక సందర్భాల్లో కేవలం ఒక సర్టిఫికెట్‌గా మాత్రమే మిగిలిపోతోంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు తగ్గుతున్నాయి. కంపెనీలు "స్కిల్స్ లేవు" అంటున్నాయి. విద్యార్థులు "ఉద్యోగాలు లేవు" అంటున్నారు. తల్లిదండ్రులు అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితికి బాధ్యత ఎవరిది? ఒకప్పుడు ఇంజనీరింగ్ సీటు సంపాదించడం గొప్ప విషయం. కానీ తర్వాత ఇంజనీరింగ్ కళాశాలలు విచ్చలవిడిగా పెరిగాయి. ప్రతి జిల్లాలో, ప్రతి పట్టణంలో డజన్ల కొద్దీ కాలేజీలు వెలిశాయి. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చిన దుష్పరిణామం నేడు స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల భవిష్యత్తు కంటే సీట్లు నింపడమే లక్ష్యంగా అనేక సంస్థలు మారిపోయాయి. అనేక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇప్పటికీ పాత సిలబస్, కాలం చెల్లిన ల్యాబ్‌లు, పరిశ్రమలతో సంబంధం లేని బోధన కొనసాగుతోంది. తరగతి గదిలో చెప్పే పాఠాలకు పరిశ్రమల్లో అవసరమైన నైపుణ్యాలకు సంబంధం లేకుండా పోయింది. ఫలితంగా విద్యార్థి నాలుగేళ్లు చదివినా, ఉద్యోగానికి అవసరమైన కనీస నైపుణ్యాలు కూడా లేకుండా బయటకు వస్తున్నాడు. ఇక్కడ కాలేజీల బాధ్యత చాలా పెద్దది. చాలా కళాశాలలు న్యాక్ గ్రేడ్లు, ఎన్బీఏ గుర్తింపులు, ప్రకటనలు, రంగురంగుల బ్రోచర్లు, భారీ భవనాలపై దృష్టి పెడుతున్నాయి. కానీ ఒక ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతున్నాయి. 'మీ కాలేజీలో చదివిన విద్యార్థుల్లో ఎంతమందికి నాణ్యమైన ఉద్యోగాలు వచ్చాయి?' ఈ ప్రశ్నకు నిజాయితీగా సమాధానం చెప్పే సంస్థలు చాలా తక్కువ. అనేక కాలేజీల్లో అధ్యాపకుల కొరత ఉంది. పరిశ్రమ అనుభవం ఉన్న అధ్యాపకులు చాలా అరుదు. ప్రయోగశాలలు కేవలం తనిఖీల సమయంలో మాత్రమే పనిచేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇంటర్న్‌షిప్‌ల పేరుతో కాగితాలపై సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ప్రాజెక్టులు విద్యార్థుల ఆలోచనతో కాకుండా మార్కెట్‌లో కొనుగోలు చేసిన నివేదికలతో పూర్తవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నాణ్యమైన ఇంజనీర్లు ఎలా తయారవుతారు? ఎన్నో సంవత్సరాలుగా ఇంజనీరింగ్ కళాశాలలకు అనుమతులు ఇచ్చారు. కానీ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సీట్ల సంఖ్యను సమీక్షించలేదు. ఏ కోర్సులకు డిమాండ్ ఉంది? ఏ కోర్సులు కాలం చెల్లిపోయాయి? ఎక్కడ నాణ్యత లేదు? అనే ప్రశ్నలపై సమగ్ర సమీక్ష జరగలేదు. ప్రభుత్వాలు తరచూ "స్కిల్ డెవలప్‌మెంట్" గురించి మాట్లాడుతున్నాయి. కానీ అసలు ప్రశ్న ఏమిటంటే.. ఇంజనీరింగ్ చదివిన తర్వాత మళ్లీ స్కిల్ డెవలప్‌మెంట్ ఎందుకు చేయాలి? నాలుగేళ్ల డిగ్రీ పూర్తయ్యాక కూడా మరో ఆరు నెలలు లేదా ఏడాది శిక్షణ తీసుకున్న తర్వాతే ఉద్యోగానికి పనికొస్తే, కాలేజీలు నాలుగేళ్లు ఏమి నేర్పాయి? ఇది విద్యార్థుల సమయానికే కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టం. నేడు ప్రపంచం కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, డ్రోన్ టెక్నాలజీ వైపు దూసుకెళ్తోంది. కానీ ఇంకా అనేక కళాశాలల్లో పది, పదిహేను సంవత్సరాల క్రితం ఉన్న సిలబస్‌లతోనే బోధన కొనసాగుతోంది. పరిశ్రమలు వేగంగా మారుతుంటే, విద్యా వ్యవస్థ మాత్రం నత్తనడకన నడుస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఐటీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. హైదరాబాద్ ప్రపంచ ఐటీ మ్యాప్‌పై నిలిచింది. విశాఖపట్నం, తిరుపతి, వరంగల్ వంటి నగరాల్లో పరిశ్రమలు వస్తున్నాయి. అయినా స్థానిక విద్యార్థుల్లో చాలామంది ఆ అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఎందుకంటే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు వారికి అందడం లేదు. ఈ పరిస్థితిని మార్చాలంటే సంస్కరణలు తప్పనిసరి. ఉద్యోగాలు కల్పించలేని, నాణ్యత లేని ఇంజనీరింగ్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే విలీనం చేయాలి లేదా మూసివేయాలి.

# చేతిలో పట్టా.. లేదు స్కిల్!



**ఉద్యోగాలు లేవు అని యువత అంటోంది.. అర్హులైన అభ్యర్థులు లేరు అని పరిశ్రమలు చెప్తున్నాయి.. ఈ రెండు వాదనలు ఒకేసారి నిజమైతే, సమస్య ఉద్యోగాల కొరతలో కాదు.. నైపుణ్యాలే లోపం.**

**ఇదే నేడు భారతదేశం, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా భారత్‌కు ఇది ఒక గొప్ప అవకాశం. కానీ ఆ యువశక్తిని సరైన నైపుణ్యాలతో తీర్చిదిద్దలేకపోతే అదే జనాభా లాభం నిరుద్యోగ భారంగా మారే ప్రమాదం ఉంది.**

ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఇంజినీరింగ్, డిగ్రీ, ఎంబీఏ, డిప్లొమా, ఐటీఐ వంటి కోర్సులను పూర్తి చేస్తున్నారు. విశ్వవిద్యాలయాల నుంచి పట్టాలు అందుకుంటున్నారు. అయితే ఉద్యోగ మార్కెట్‌లో అడుగుపెట్టిన తర్వాత వారిలో చాలా మంది తీవ్ర నిరాశను ఎదుర్కొంటున్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేస్తే అనుభవం అడుగుతున్నారు. అనుభవం సంపాదించాలంటే ఉద్యోగం కావాలి. ఈ వలయంలో చిక్కుకుని లక్షలాది మంది యువత సంవత్సరాల తరబడి పోటీ పరీక్షలు, తాత్కాలిక ఉద్యోగాలు లేదా నిరుద్యోగ జీవితంతో కాలం గడుపుతున్నారు. మరోవైపు పరిశ్రమలు కూడా తమ ఇబ్బందులను చెబుతున్నాయి. ఆధునిక సాంకేతిక రంగాల్లో అవసరమైన నైపుణ్యాలు ఉన్న అభ్యర్థులు దొరకడం లేదని అంటున్నాయి. ముఖ్యంగా కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్ డిజైన్, రోబోటిక్స్, ఆటోమేషన్, ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన సిబ్బందికి భారీ డిమాండ్ ఉంది. కానీ విద్యా సంస్థల నుంచి బయటకు వస్తున్న విద్యార్థుల్లో చాలామంది ఇంకా పాత సిలబస్‌తో, మార్కుల ఆధారిత విద్యతోనే పరిమితమవుతున్నారు. మన విద్యా వ్యవస్థలో ప్రధాన లోపం ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మారకపోవడం. అనేక కళాశాలల్లో ఇప్పటికీ సిద్ధాంతపరమైన బోధనకే ఎక్కువ ప్రాధాన్యం ఉంది. ప్రయోగాత్మక శిక్షణ, పరిశ్రమల అనుసంధానం, ఇంటర్న్‌షిప్‌లు, సమస్య పరిష్కార నైపుణ్యాలు, కమ్యూనికేషన్, బృందంగా పనిచేసే సామర్థ్యం వంటి అంశాలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదు. ఫలితంగా డిగ్రీ పూర్తయినా ఉద్యోగానికి సిద్ధమైన అభ్యర్థులు తక్కువగానే ఉంటున్నారు. ఇప్పటి ఉద్యోగ ప్రపంచం వేగంగా మారుతోంది. ఒకప్పుడు ఒక డిగ్రీ జీవితాంతం సరిపోయేది. ఇప్పుడు ప్రతి ఐదేళ్లకోసారి కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏఐ రాకతో అనేక సంప్రదాయ ఉద్యోగాల స్వరూపం మారుతోంది. కొన్ని ఉద్యోగాలు కనుమరుగవుతుండగా, కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయి. ఈ మార్పుకు అనుగుణంగా యువత నిరంతర అభ్యాసం అలవాటు చేసుకోవాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ఈ విషయంలో ప్రత్యేక అవకాశం ఉంది. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా, డేటా సెంటర్లు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, స్టార్టప్‌లకు ప్రధాన కేంద్రంగా ఎదిగింది. విశాఖపట్నం, తిరుపతి, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ వంటి నగరాలు కూడా కొత్త పరిశ్రమలను ఆకర్షిస్తున్నాయి. ఈ అవకాశాలను స్థానిక యువత అందిపుచ్చుకోవాలంటే వారి నైపుణ్యాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. ప్రభుత్వాలు కూడా నైపుణ్యాభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలి. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, పాలిటెక్నిక్‌లు, ఐటీఐలు, డిజిటల్ శిక్షణ కేంద్రాలను ఆధునికీకరించాలి. పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకొని శిక్షణ పూర్తయ్యే సరికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధానాలను రూపొందించాలి. "చదువు, శిక్షణ, ఉద్యోగం" అనే గొలుసు బలపడితేనే నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. కళాశాలల పాత్ర కూడా మారాలి. కేవలం డిగ్రీలు ఇచ్చే కేంద్రాలుగా కాకుండా, ఉపాధి కల్పించే నైపుణ్యాల కేంద్రాలుగా రూపాంతరం చెందాలి. ప్రతి కళాశాలలో పరిశ్రమలతో అనుసంధానమైన ఇంటర్న్‌షిప్‌లు, స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్లు, కెరీర్ గైడెన్స్ సెల్‌లు, కమ్యూనికేషన్ శిక్షణ, డిజిటల్ నైపుణ్యాల కోర్సులు ఉండాలి. నేటి యువత ప్రభుత్వ ఉద్యోగాలపైనే పూర్తిగా ఆధారపడే పరిస్థితి నుంచి బయటకు రావాలి. ప్రభుత్వ ఉద్యోగాలు పరిమిత సంఖ్యలోనే ఉంటాయి. ప్రైవేట్ రంగం, స్టార్టప్‌లు, స్వయం ఉపాధి, ఫ్రీలాన్సింగ్, డిజిటల్ సేవలు, అగ్రి-టెక్, ఫిన్‌టెక్, ఈ-కామర్స్ వంటి రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయి. ఒక ఉద్యోగం కోసం వేల మంది పోటీ పడటానికి బదులు, నైపుణ్యాలతో కొత్త అవకాశాలను సృష్టించే దిశగా యువత ఆలోచించాలి. వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు కూడా ఉపాధికి పెద్ద వనరులుగా మారవచ్చు. ఆహార ప్రాసెసింగ్, పాల ఉత్పత్తులు, మత్స్య పరిశ్రమ, గ్రామీణ పర్యాటకం, హస్తకళలు, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తే గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. నగరాలకు వలసలు కూడా తగ్గుతాయి. మహిళల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. డిజిటల్ విద్య, ఇంటి నుంచే చేయగల ఉపాధి, చిన్న వ్యాపారాలు, స్టార్టప్‌లు, ఆన్‌లైన్ మార్కెటింగ్ వంటి రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తే కుటుంబ ఆదాయం పెరగడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుంది. ఈ సమస్యకు మరో కోణం కెరీర్ మార్గదర్శకత్వం లేకపోవడం. చాలామంది విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యం, భవిష్యత్ అవకాశాలను అంచనా వేయకుండా కోర్సులను ఎంచుకుంటున్నారు. పాఠశాల స్థాయి నుంచే కెరీర్ కౌన్సెలింగ్ అందుబాటులో ఉండాలి. భవిష్యత్ ఉద్యోగాలపై అవగాహన కల్పించాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతోంది. కృత్రిమ మేధ, ఆటోమేషన్, డిజిటల్ పరివర్తన కారణంగా ఉద్యోగాల స్వరూపం కూడా మారుతోంది. ఈ మార్పును సవాలుగా కాకుండా అవకాశంగా మార్చుకోవడం యువత చేతుల్లోనే ఉంది. ప్రభుత్వం విధానాలు రూపొందించగలదు. విద్యాసంస్థలు శిక్షణ ఇవ్వగలవు. పరిశ్రమలు అవకాశాలు కల్పించగలవు. కానీ నేర్చుకోవాలనే తపన, కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాలనే సంకల్పం యువతలో ఉండాలి. డిగ్రీ ఒక గమ్యం కాదు.. అది ప్రయాణానికి ప్రారంభం మాత్రమే. మార్కులు ఉద్యోగానికి తలుపు తట్టవచ్చు; కానీ నైపుణ్యాలే ఆ తలుపును తెరుస్తాయి. యువతను ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, అవకాశాలను సృష్టించే వారిగా తీర్చిదిద్దగలిగితేనే భారతదేశ జనాభా లాభం నిజమైన ఆర్థిక శక్తిగా మారుతుంది.



లక్ష్మణ్ మంగళారపు, విద్యావేత్త

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.